

వార్త
ఆదివారం
16 జులై, 2023

# ఆరోగ్య ధామాలు ఆసుపత్రులే





# బన్నీ-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో మరో సినిమా!

**స్టైలిష్‌స్టార్** అల్లు అర్జున్ ప్రస్తుతం సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న 'పుష్ప 2' చిత్రం షూటింగులో బిజీగా ఉన్నాడు. స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో బన్నీ కొత్త ప్రాజెక్ట్‌ను తాజాగా ప్రకటించారు. 'జులాయి', 'సన్ ఆఫ్ సత్యమూర్తి', 'అల వైకుంఠపురములో' వంటి సూపర్ హిట్‌ల తర్వాత అల్లు అర్జున్-త్రివిక్రమ్ మరోసారి జత కట్టారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్, గీతా ఆర్ట్స్ కలిసి ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మించనున్నాయి.

ఈ సినిమాకి సంగీత దర్శకుడు థమన్ సంగీతం అందించబోతున్నాడు.

## తారాతీరం



# పవన్‌కళ్యాణ్ జోడీగా ఐశ్వర్య మీనన్?

**పవర్** స్టార్ పవన్ కళ్యాణ్ యంగ్ డైరెక్టర్ సుజీత్ దర్శకతంలో 'ఓజీ' (ఓజస్ గంభీర) చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ప్రస్తుతం షూటింగు దశలో ఉన్న ఈ చిత్రంపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో బాలీవుడ్ నటులు ఇమ్రాన్ హాష్మి, ప్రకాశ్‌రాజ్, తమిళ నటుడు అర్జున్‌దాస్, శ్రేయారెడ్డి మొదలైనవారు నటిస్తున్నారు. పవన్ సరసన కథానాయిక గా ప్రియాంక అరుళ్‌మోహన్‌ను తీసుకున్నారు. తాజాగా ఈ చిత్రంలోకి మరో యువ నటిని తీసుకున్నట్టు సమాచారం. నిఖిల్ హీరోగా వచ్చిన 'స్పై' సినిమా హీరోయిన్ ఐశ్వర్యా మీనన్‌కు ఆ అవకాశం దక్కినట్టు తెలుస్తోంది. కేరళకు చెందిన ఐశ్వర్యామీనన్ తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం 'లవ్ ఫెయిల్యూర్' తో టాలీవుడ్‌కు పరిచయం అయింది. నిఖిల్ సిద్ధార్థ్‌తో కలిసి పూర్తి స్థాయిగా హీరోయిన్‌గా 'స్పై'లో నటించింది. ఈ సినిమాలో ఐశ్వర్యా మీనన్ యువతను ఆకట్టుకుంది. దాంతో 'ఓజీ' లో ఆమెకు అవకాశం వచ్చినట్లు తెలుస్తోంది. డీవీవీ దానయ్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

ఆదివారం వార్త

16 జూలై, 2023

## మంచి ముత్యాలు

నీతికొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు,

వారు తృప్తిపరచబడుదురు.

- యేసుక్రీస్తు

## విషయ విశేషం

సరస్సులో బడి.... 4

'సంఘీ'భావం....5

కూరగాయల సాగుకు ప్రణాళిక శూన్యం

కవర్ స్టోరీ..6

ఆరోగ్య ధామాలు

ఆసుపత్రులే

భూగర్భంలో హోటల్..11

ఈవారం కవిత్వం..12

మా బాపు

సంపన్న గ్రామాలు.....14

కథ.. 20

ప్రాణమిత్రుడు

సాహిత్యం..24

సాహిత్యంలో సినీ గేయాల ప్రాశస్త్యం

ఈ ప్రక్రియలతో మెదడుకు చైతన్యం!...26

గెలుపులో ఓటమి....30

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### బట్టలు కొంటే పుస్తకాలు ఫ్రీ



బట్టల షాపుల్లో డిస్కౌంట్లు ఇవ్వడం కూపన్లు ఇచ్చి..ఆ డబ్బును మరోసారి షాపింగ్ చేసినప్పుడు ఖర్చు పెట్టుకోమనడం మనకు తెలిసిందే. అయితే చెన్నైలోని ఓ బట్టల షాపు మాత్రం అందుకు భిన్నంగా చేస్తోంది. షాపింగ్ చేసిన వారికి సరికొత్త అనుభూతిని కలిగించాలనీ, పుస్తక పఠనాన్ని పెంపొందించాలనీ ఆలోచించింది పోతీస్ సంస్థ. తమ వద్ద బట్టలు కొనుక్కున్న వారి బిల్లును బట్టి కొన్ని కూపన్లు అందిస్తోంది. వాటి పైన ఎ1,ఎ2, బి1,బి2..ఇలా ఈ2 వరకూ గ్రేడ్లు వేసి ఉంటాయి. ఆ కూపన్లు తీసుకుని బిల్లింగ్ కౌంటర్ పక్కనున్న బుక్‌స్టాల్‌లోకి వెళితే కూపన్‌పైన ఉన్న గ్రేడ్ దగ్గర ఏ పుస్తకాలు ఉంటే అవి ఉచితంగా తీసుకోవచ్చన్నమాట. రెండుమూడు పుస్తకాలు మాత్రమే ఉచితంగా తీసుకునే వీలున్న ఆ స్టాల్‌లో వేలాది పుస్తకాలను అందుబాటులో ఉంచింది పోతీస్. లైఫ్‌స్టైల్, జీవితచరిత్రలు, సైన్స్ ఫిక్షన్, పిల్లల పెంపకం, కథల పుస్తకాల వంటి వెన్నో అక్కడ ఉన్నాయి. బట్టలతో వార్డ్‌రోబ్‌నీ, పుస్తకాలతో మెదడునీ అప్‌డేట్ చేసుకోమని సరికొత్తగా సందేశాన్నిస్తోంది ఆ షాపు.

### జోక్స్..జోక్స్

రవి: మా పక్కింటాయన భార్య కనిపించడం లేదు సార్..
పోలీస్: పక్కింటాయన భార్య గురించి నువ్వెందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కంప్లయింట్ ఇస్తున్నావు?!
రవి: వాడు రోజూ పార్టీలు చేసుకోవడం భరించలేకపోతున్నాను సార్..అందుకనే వచ్చాను.

...

కాంతం: అదేంటయ్యా టమోటాలు కేజీ రూ 120 చెప్తున్నావ్.. మొన్న సంతలో 40రూపాయలకే అమ్మారు కదా?
కూరగాయల వ్యాపారి: నాసిన్నప్పుడు కాసు బంగారం 30 రూపాయలండీ. మరిప్పుడు 30వేలండీ..ఎప్పుడి రేటు అప్పుడేనండీ..

...


రాము: బ్రహ్మచారికి, పెళ్లైనవాడికి తేడా ఏమిటి?
శాస్త్రి: బ్రహ్మచారి 'ఏది పడితే' అది తింటాడు.
పెళ్లైనవాడు 'ఏదిపెడిత' అదే తింటాడు.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com



# సరస్సులో బడి

సాధారణంగా స్కూల్ బిల్డింగులు ఎక్కడైనా భూమ్మీదే ఉంటాయి. కొన్నిచోట్ల వాటి చుట్టూ ఆటస్థలాలు కనిపిస్తాయి. మణిపూర్‌లోని చాంప్ ఖాంగోపోక్ గ్రామంలోని బడిమాత్రం వాటికి భిన్నంగా నిలుస్తుంది. ఆ ఊళ్లో సగం అక్కడి మంచినీళ్ల సరస్సులో తేలియాడుతూ ఉంటుంది. చిన్నచిన్న దీవుల్లో విసిరేసినట్టు కనిపిస్తాయి ఇళ్లు. అందుకే ఆ గ్రామం పర్యటక ప్రాంతంగానూ మారిపోయింది. చాంప్ ఖాంగ్‌పోక్‌లోని లోక్‌తక్. దేశంలోనే అతిపెద్ద మంచినీటి సరస్సు చేపల వేటను నమ్ముకున్న ఎందరికో అది జీవనాధారం. దాంతో ఆ చుట్టుపక్కల గ్రామస్తులు ఆ పనిలో పడి.. పిల్లల చదువుల్ని పట్టించుకోవడం మానేశారు. పైగా పిల్లల్ని స్కూల్లో చేర్పించినా వారు మధ్యలోనే మానేయడంతో ఆ ప్రాంతంలో డ్రాపవుట్ల సంఖ్య కూడా ఎక్కువే. ఆ సమస్యకు పరిష్కారంగా ఓ ఎన్జీఓ.. సరస్సు మధ్యలో బల్లకట్టు ఏర్పాటు చేసి దానిపైన తరగతి గదులకోసం గుడిసెలు నిర్మించి స్కూలుకు ప్రారంభించింది. సరస్సు మధ్యలో ఉండటంతో పిల్లలు ఎప్పుడంటే అప్పుడు ఇంటికి వెళ్లడానికి కూడా ఉండదు. వారిని అక్కడి టీచర్లు ఉదయాన్నే ఓ పడవలో తీసుకొని స్కూలుకెళతారు. మళ్లీ సాయంత్రం బడి అయ్యే సమయానికి పడవ బయల్దేరుతుంది. ఇంటింటికీ వెళ్లి పిల్లల్ని దింపే బాధ్యత కూడా టీచర్లదే. ఆ జాగ్రత్తలతో డ్రాపవుట్లు లేకుండా పిల్లలు చక్కగా చదువుకుంటున్నారు.



# ఆరోగ్యరంగంలో కృత్రిమ మేధ

కొవిడ్-19 కలిగించిన నష్టం అంతాఇంతా కాదు. మున్ముందు ఇలాంటి మహమ్మారులు వస్తే? వాటిని అంచనా వేయటం, తగు విధంగా సన్నద్ధం కావటం, ఇతరత్రా సవాళ్లను ఎదుర్కోవటం చాలా కీలకం. ఇందుకు వినూత్న ఏఐ ఆధారిత పరిజ్ఞానాలు, మెషిన్ లెర్నింగ్ టూల్స్ పుట్టుకొస్తున్నాయి. ఆరోగ్యసంక్షోభాలను దేశీయంగా, ప్రపంచవ్యాప్తంగా ఎదుర్కోవటానికి, వైద్యసేవలను మెరుగు పరచటానికి ఎంతగానో తోడ్పడతాయి. వైద్య సదుపాయాల అందుబాటును బట్టి ఇవి చికిత్సల అవసరాల్లో మార్పులు చేర్పులు సూచిస్తాయి. దీంతో చికిత్సల కోసం వేచి ఉండే సమయమూ తగ్గుతుంది. ఎక్కువ మందికి వైద్యం చేయటానికీ వీలు కలుగుతుంది.

# ఇంటికే పిండిమర

నగరాల్లో వంట నుంచి వైద్యం వరకూ ఎన్నో రకాల సేవలు ఇంటివద్దకే అందుబాటులోకి వచ్చాయి. ఇంట్లోంచి కదలకుండా దాదాపు చాలా పనులే చక్కబెట్టుకుంటున్నారు నగరవాసులు. ఆ జీవితాన్ని అధ్యయనం చేసిన ఓ పల్లెటూరి కుర్రాడు గ్రామాల్లోనూ డోర్ డెలివరీ సేవలు లాభదాయకంగా ఉంటాయని భావించాడు. అనుకున్నట్టుగానే ఒకరోజు ఆ ప్రయోగం చేసి ఊహించని లాభాలను కళ్లజూశాడు. ఒక్కోనెల్లో ఆ పిండి మిల్లును నడపడానికి అయ్యే కరెంట్ బిల్లుకు సరిపోయే ఆదాయం కూడా వచ్చేది కాదు. సిటీల్లోని డోర్ డెలివరీ సేవలకొచ్చే స్పందన గురించి స్నేహితుల ద్వారా తెలుసుకున్న సుఖ్‌మన్ తన పిండిమరను ఓ బైకుపైన అమర్చి చుట్టు పక్కల గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి పిండి పట్టడం మొదలుపెట్టాడు. మగవాళ్లపై ఆధారపడకుండా..ఇంట్లోనే ఎంచక్కా గోధుమలు, బియ్యం, చిరుధాన్యాల వంటివన్నీ పట్టించుకుంటున్నారు ఆడవాళ్లు. మరోవైపు అలా చేయడం సుఖ్‌మన్‌కి లాభాదాయకంగానూ మారింది. ఒకప్పుడు రోజుకు వంద రూపాయలు రావడమే గగనమైన అతనికి పదిహేను వందలకుపైగా వస్తుండటంతో మరిన్ని గ్రామాలకు తన సేవలు విస్తరించి అధిక ఆదాయం పొందుతున్నాడు.



'సంఘీ' భావం



# కూరగాయల సాగుకు ప్రణాళిక శూన్యం

తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్యులు మార్కెట్‌కు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఎండల వేడిమి అధికం కావడం, కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాల కారణంగా కూరగాయల ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో రైతులకు అందుతున్న మొత్తానికి, మార్కెట్‌లో విక్రయిస్తున్న ధరలకు ఏమాత్రం పొంతన ఉండటం లేదు. ప్రస్తుతం టమోటా ధర మార్కెట్‌లో కిలో 150 రూపాయల వరకు ఉంది. అయితే రైతుకు మాత్రం 50 నుంచి 80 రూపాయలు దక్కుతోంది. రైతుకు వినియోగదారుడికి మధ్య ఉన్న దళారులు ధరలు గణనీయంగా పెంచి ప్రయోజనాన్ని పొందుతున్నారు. చాలా పంటలకు ప్రభుత్వాలు గిట్టుబాటు ధరను ప్రకటించినప్పటికీ కూరగాయల సాగుకు మాత్రం ఎటువంటి ప్రోత్సాహం ఉండటం లేదు. ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు పెరిగిన టమోటాను ఒకప్పుడు 2 రూపాయల ధర కూడా రాకపోవడంతో చేలలోనే వదిలివేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. అకాల వర్షాల కారణంగా ఆకుకూరలు చేలలో కోసే పరిస్థితి లేకపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో పెట్టుబడి కూడా రాక రైతులు నష్టపోతున్నారు. ఇతర పంటలతో పోలిస్తే కూరగాయలకు మినిమం మార్కెట్ ఉంటుంది. సీజన్‌తో సంబంధం లేకుండా మార్కెట్‌లో కూరలు విక్రయించుకునే అవకాశం ఉంది. ఒక్క హైదరాబాద్ నగరంలోనే అతి పెద్ద కూరగాయల మార్కెట్ ఉంది. దీనితో తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల్లో పండించిన కూరలు కూడా ఇక్కడకు చేరుకుంటూ ఉంటాయి. రాష్ట్రంలో గత దశాబ్దకాలంగా సాగు తీరును పరిశీలిస్తే ప్రతి ఏటా పంట విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. వరి, పత్తి, చెరకు, పెసర వంటి పంటల సాగు గణనీయంగా పెరుగుతున్నాయి. వరికి ఎకరానికి వినియోగించిన నీటితో కూరగాయలకు ఆరు నుంచి ఏడు ఎకరాలకు సరిపోతుంది. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి పొందే అవకాశం కూరగాయల పంటకు ఉంది. అయినా ధరల్లో ఒక్కసారిగా వస్తున్న వ్యత్యాసం కారణంగా రైతులు నష్టపోతున్నారు. పైగా నిత్యం ఎక్కువ మంది కూలీలను వినియోగించాల్సి వస్తోంది. విత్తనాల నుంచి కూలీల వరకు అన్ని రకాల ధరలు గణనీయంగా పెరిగాయి. అయినా కూరల ధరలు మాత్రం రైతులకు కలిసివచ్చే విధంగా ఉండటం లేదు. రాష్ట్రంలో గతంలో లక్షా పదివేల ఎకరాల్లో కూరగాయల సాగు సాగేది. ప్రస్తుతం 50 వేల ఎకరాలకు తగ్గిపోయింది. అదేవిధంగా తెలంగాణకు సుమారు 45 శాతం కూరగాయలు స్థానిక గ్రామాల నుంచి లభించేది. మిగిలిన 65 శాతం ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అయ్యేది. అయితే ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 25 శాతం వరకు మాత్రమే స్థానిక లభ్యత ఉంటోంది. దీనితో దూర ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకోవడంతో రవాణా ఖర్చులు భారం అధికంగా ఉంటోంది. గతంలో తెలంగాణ ప్రభుత్వం కూరగాయల సాగును రెండు లక్షల ఎకరాలకు విస్తరింప చేస్తామని ప్రకటించింది. అయితే ఉద్యాన పంటలకు, వాణిజ్య పంటలకు లభిస్తున్న ఆదరణ కూరగాయల సాగు చేసే రైతులకు అందడం లేదు. కూరగాయలను నిల్వ చేసుకునే పరిస్థితి ఉండదు. రెండు మూడు రోజుల్లో వాటి విక్రయాలు పూర్తి చేయాలి. ఆకుకూరలకు కేవలం రెండు రోజుల గడువు మాత్రమే ఉంటుంది. దీనితో రైతులు వచ్చినకాడికి విక్రయాలు చేసుకుంటున్నారు. మార్కెట్‌లో ఎక్కువ ధర పలికినప్పుడు ఆ నిష్పత్తిలో రైతుకు ప్రయోజనం కలగడం లేదు. ధర పడిపోయినప్పుడు దళారులు రైతుల వద్దకు వెళ్లడం లేదు. దీనితో రైతు తీవ్రంగా నష్టపోతున్నాడు. కూరగాయలకు స్థిరమైన మార్కెట్ ఉన్నప్పటికీ ఒడిదుడుకులు తప్పడం లేదు. మార్కెట్‌లో ఎంత ధర ఉన్నా తప్పనిసరిగా కొనాల్సిన పరిస్థితి ఉంది. దీనిని ఆసరాగా తీసుకుని దళారులు మార్కెట్‌లో ఇష్టారీతిన ధరలు పెంచేస్తున్నారు. ఇతర పంటకు ప్రభుత్వం అందిస్తున్న చేయూతను కూరగాయల పంటకు కూడా ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే రైతు బజార్లు ఏర్పాటుచేసి కేవలం రైతులు మాత్రమే అక్కడ విక్రయాలు చేసే అవకాశం కల్పించారు. అయితే దళారులు ఇక్కడ కూడా తమ పరపతిని ఉపయోగించి రైతులకు బదులు తామే విక్రయాలు చేస్తున్నారు.

నకిలీ రైతు పుస్తకాలను తయారుచేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులకు విషయాలు తెలిసినా పట్టించుకోవడం లేదు. మరోవక్క రైతులు ఏ కూరగాయలను ఎప్పుడు వేయాలన్న విషయంపై వారికి దిశానిర్దేశం చేసే వారు లేకుండా పోయారు. రాష్ట్రంలో రెండు సీజన్లకు సంబంధించి వ్యవసాయ ప్రణాళికలు రూపొందించి రైతులకు తగిన సూచనలు ఇస్తారు. అయితే కూరగాయలు పండించే రైతులకు మాత్రం ఎటువంటి సలహాలు, సహాయం అందడం లేదు. మార్కెట్‌లో ఏదైనా కూరగాయల ధర పెరిగితే రైతులంతా ఆ పంట వేయడానికి మొగ్గు చూపుతున్నారు. దీనితో డిమాండ్‌కు మించి ఉత్పత్తి కావడంతో ఒక్కసారిగా ధరలు పడిపోతున్నాయి. ఉదాహరణకు టమోటా 150 రూపాయలు పలకడంతో రైతులు అంతా అదే పంటను వేస్తున్నారు. దీనితో డిమాండ్ పడిపోయి 5 రూపాయలు పలుకుతుంది. ఈ విషయంలో వ్యవసాయ అధికారులు తగిన సూచనలు చేస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రభుత్వాలు కూరగాయల సాగుకు కూడా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# ఆరోగ్య ధామాలు ఆసుపత్రులే

కవర్ స్టోరీ

**తండా సదానందం**

"ఆరోగ్యమే మహాభాగ్యం" అన్నారు పెద్దలు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రజలు సరైన ఆలోచన విధానాన్ని కలిగి ఉంటారు. సరైన ఆలోచనతోనే చక్కగా పని చేయడం జరుగుతుంది. దాంతో ఆర్థిక పరిపుష్టి కలిగి అభివృద్ధి పథంలోకి పయనించే అవకాశం ఉంటుంది. తద్వారా వ్యక్తిగత అభివృద్ధి జరిగి దేశ అభివృద్ధికి దోహదపడి ఆరోగ్యవంతమైన ఆదర్శవంతమైన సమాజం ఏర్పడుతుంది. దేశ అభివృద్ధికి, సౌభాగ్యానికి ఆరోగ్యం ముఖ్యమైనది. ఆరోగ్యవంతమైన శరీరంలోనే ఆరోగ్యవంతమైన మనసు ఉంటుంది. అందుకే ప్రతిఒక్కరు ఆరోగ్యంగా ఉండాలి. ఆరోగ్యంగా ఉండడానికి ప్రయత్నించాలి. మంచి ఆరోగ్య పరిసరాలను కల్పించుకోవాలి.

**ఆరోగ్యం అంటే-**

మనిషి శారీరకంగాను, మానసికంగానూ సామాజికంగా, ఆర్థికంగానూ తను ఉన్న పరిసరాలలో హాయిగా జీవించడమే ఆరోగ్యం అంటారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ఆరోగ్యం అంటే శారీరక మానసిక సాంఘిక ఆధ్యాత్మిక కుశలత, అంతేకానీ కేవలం ఏదైనా ఒక వ్యాధి గానీ లేక వైకల్యంగానీ లేకపోవడం మాత్రమే కాదు అని వివరిస్తుంది. శారీరకంగా పనిచేయగల సామర్థ్యంతో మానసిక ఆరోగ్యాన్ని ఒక మనో కుశలతగా ప్రపంచ ఆరోగ్య సంస్థ వర్ణిస్తుంది. కనుక ఆరోగ్యమనేది ఒక వ్యక్తి మానసిక శ్రేయస్సుకు పునాది, సమర్థవంతంగా పనిచేయడానికి ఉపయోగపడేది. వయసుకు తగ్గ బరువు సమపాళ్లలో శారీరక ఉష్ణోగ్రత, గుండెలయ, నాడీలయ, రక్తపోటు, మూల జీవక్రియ రేటు కలిగిన వారిని ఆరోగ్యవంతులుగా నిర్ధారిస్తారు. వీటిలో ఏది లోపించినా అనారోగ్యవంతులుగానే పరిగణిస్తారు. కానీ ఇటీవల చాలామంది ఏదో ఒక బాధతో అనారోగ్యం బారిన పడుతున్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఉరకులు పరుగుల ప్రపంచంలో ఆందోళన, ఒత్తిడి, యాంగ్జైటీ, చిరాకు, విసుగు వంటి వాటితో జీవక్రియలు లయ తప్పి హార్మోన్ల అసమతుల్యతతో నేటి సమాజంలో ఆరోగ్య సమస్య లేనివారు లేరంటే అతిశయోక్తి కాదు. మారుతున్న లైఫ్ స్టైల్‌లో భాగంగా రోగాల బారిన పడుతున్నవారి సంఖ్య అధికం అవుతుంది. వారానికి 15 రోజులకు లేదా నెలకు ఒకసారి హాస్పిటల్‌కి వెళ్లాల్సిన పరిస్థితి తీవ్రతరమైంది. వ్యాధులు ప్రజల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. కరోనా కల్లోలం తర్వాత హాస్పిటల్‌కి వెళ్లనివారిని వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. కరోనా సమయంలో కరోనా బారిన పడినవారు ఇప్పుడు పోస్ట్ కొవిడ్ సమస్యలతో గుండె సంబంధింత వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు, రోగ నిరోధక శక్తి తగ్గిపోవడం లాంటి సమస్యలతో బాధపడుతూ వాటిని నయం చేసుకోవడానికి ఆసుపత్రుల మెట్లు ఎక్కనివారంటూ లేరు. వీటితో పాటు దేశంలో రాష్ట్రంలో కేన్సర్ మహమ్మారి, దీర్ఘకాలిక టీబీ, డయాబెటిస్, బిపి, కిడ్నీ, లివర్ వ్యాధులు ప్రజల జీవితాలను పట్టిపీడిస్తున్నాయి. వీటిని నయం చేసుకొని తగ్గించుకొని జీవిత కాలాన్ని పెంచుకునేందుకు ప్రజలు హాస్పిటల్స్‌పై, డాక్టర్లపై ఆధారపడాల్సిందే.

మన దేశంలోగానీ, రాష్ట్రంలోగానీ ప్రజల అవసరాలకు వారికి వచ్చే వ్యాధులకు తగ్గట్లు నయం చేసేందుకు సరిపడా ప్రభుత్వ ఆస్పత్రులు, సిబ్బంది, డాక్టర్లు లేరు. దీంతో ప్రజలు ఎక్కువ శాతం ప్రైవేటు ఆసుపత్రులపై ఆధారపడుతు న్నారు. వైద్య విధానం కార్పొరేటీకరణ గావించబడింది. దీంతో వైద్య సదుపాయా లు మెరుగైన సేవల సౌకర్యాలు పెరగడం తో పాటు వ్యాపారీకరణ చెంది ఆసుపత్రు లు కాసుపత్రులుగా మారి వైద్యో నారాయణోహరి అన్న సూక్తిని వ్యాపార సూత్రంగా మార్చి లాభార్జన ధ్యేయంగా ప్రజల అమాయకత్వాన్ని ఉద్విగ్న క్షణాలు అడ్డుపెట్టుకొని టెస్టులు ట్రీట్‌మెంట్ పేరుతో నయా దందాకు పాల్పడుతూ అమానవీ యంగా నగదును దోచుకుంటున్నారు. ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకుని లక్షలాది రూపాయలు పిండుకుంటున్నారు. కరోనా అల్లకల్లోలంలో ప్రైవేట్ హాస్పిటల్స్ దోపిడీ కేంద్రాలుగా మారాయి. వ్యాధి కాస్త తీవ్రతరమైనప్పుడు హాస్పిటల్‌లో చేర్పిస్తే బతుకుతారనే నమ్మకంతో వారి వద్ద ఉన్న ఆస్తిపాస్తులు, ఆభరణాలు,ఇండ్లు అమ్మి, కుదువపెట్టి లక్షలాది రూపాయలు అప్పులు తెచ్చి చికిత్స చేయిస్తే అయినవారు దక్కకపోగా ఆర్థిక ఇబ్బందులతో చాలా కుటుంబాలు తెలుగు రాష్ట్రాల్లో కుదేలై నాయి. ప్రైవేట్ హాస్పిటల్స్‌లో కరోనా తర్వాత కన్సల్టేషన్ ఫీజులు, టెస్టుల ధరలు, ఇన్‌పేషెంట్ బెడ్ చార్జీలు,
సేవల ధరలు విపరీతంగా పెరిగాయి. సీరియస్ పేషెంట్లు అయితే వారిని ఇంటెన్సివ్ కేర్ యూనిట్లలో పెట్టి చికిత్స చేయటానికి చార్జీలు కూడా పెంచారు. హాస్పిటళ్లకు రోగులను తీసుకువచ్చే విధంగా జిల్లాల వ్యాప్తంగా పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ వ్యవస్థను నెలకొల్పడం వారికి అయ్యే ఆర్థిక భారాన్ని రోగి మీదే వేయ డం, ఆస్పత్రులకు అనుబంధంగా సొంతంగా మెడికల్ షాపులు నిర్వహిస్తూ ఎక్కువ లాభం ఉండే నాసిరకం మందులు కనీసం ఐదు నుండి పది రకాలు రాయాల ని టార్గెట్ పెట్టి డాక్టర్ల మెడపై కత్తిపెట్టిన చందంగా ఒత్తిడికి గురి చేయడం అభ్యంతరకరం. ఈ దోపిడిపై మచ్చుకు కొన్ని ఉదాహరణలు.

## పది రోజులకు అరకోటికి పైగా బిల్లు

ప్రస్తుత కాలంలో ఆసుపత్రుల బిల్లులు ఎంతగా పెరిగాయంటే అవి చెల్లించడానికి ఆస్తులను తెగనమ్మేవరకు చేరాయి. గుండెపోటుతో ఆసుపత్రిలో చేరితే చికిత్స తర్వాత బిల్లు చూసి మరోసారి గుండెపోటుతో కుప్పకూలే అవకాశం ఉంది. ఇది ఓ సామాన్యుని కథనమో, కల్పితమో కాదు, సాక్షాత్తు అక్షరాల జరిగిన సమాచారం. హైదరాబాద్‌లోని ఒక ఆసుపత్రిలో పది రోజులు చికిత్స కోసం సయ్యద్ రహ్మద్ ఉద్దీన్ రోగికి 54 లక్షలు వసూలు చేశారు.

## శవానికి ట్రీట్‌మెంట్

ఇటీవల వరంగల్‌లోని ఓ ప్రైవేట్



ఆసుపత్రిలోని వైద్యులు, శవానికి వైద్యం చేసి పదహారు లక్షల రూపాయలు అమాన వీయంగా వసూలు చేశారు. ఇంటర్మీడియ ట్ చదివే అమ్మాయి కడుపునొప్పి బాధతో పురుగుల మందు తాగితే అది గుర్తించిన కుటుంబ సభ్యులు సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ఐసియులో పెట్టి పేషెంట్ పరిస్థితి నిలకడగా ఉందని చికిత్స చేయడం జరుగుతుందని చెప్పి పదహారు లక్షలు వసూలు చేయడం, చికిత్స కొనసాగుతుందని చెప్పడంతో బంధువులు ఒకసారి పేషెంట్‌ను చూపిం చాలని కోరడంతో ఐసీయులోకి అనుమతిం చమని అంతా మా సిబ్బంది చూసుకుం టారని ఆసుపత్రి వర్గాలు బుకాయించడం తో కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగడంతో అప్పుడు ఆమె చనిపోయిందని చావుకబురు చల్లగా చెప్పడం జరిగింది. చనిపోయిన వారికే చికిత్స చేస్తున్నామని నమ్మించి డబ్బులు గుంజడం శవాలపై పేలాలు ఏరుకోవడమే కదా!

## కాసుల యావతో కడుపుకోత..

డాక్టర్ల కాసుల కక్కుర్తి తల్లీ బిడ్డల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. సాధారణ ప్రసవానికి అవకాశం ఉన్నా అధిక ఫీజు వసూలు చేయడానికి గంపెడాశతో కడుపు కోతలకు పాల్పడుతున్నారు. వీరితోపాటు మంచి ముహూర్తంలో శిశువు జన్మించాలని అశాస్త్రీయ నమ్మకంతో ఆలోచించడం మూలంగా, పురిటి నొప్పులు భరించలేదని ఆందోళన పడే తల్లిదండ్రుల అతిభయం వలన సిజేరియన్లు పెరుగుతున్నాయి. సాధారణ కాన్పులో తక్కువ రక్తస్రావంతో ఆసుపత్రిలో ఎక్కువ రోజులు ఉండాల్సిన అవసరం కొత్తగా ఉండదు. కేవలం వారం రోజుల్లోనే సాధారణ స్థితికి చేరుకుంటారు. అదే సిజేరియన్ అయితే అధిక రక్తస్రావం సమస్యతో పాటు వారం నుండి పది రోజుల వరకు ఆస్పత్రిలోనే ఉండాల్సి వస్తుంది. సాధారణ ప్రసవానికి ముప్పై ఐదు వేల నుండి నలభై వేల వరకు ఖర్చు అయితే అదే సిజేరియన్ జరిగితే మామూలు నర్సింగ్ హోమ్‌లోనైనా ఎనభై వేల నుండి లక్ష దాకా ఖర్చవుతుంది. ఇక కార్పొరేట్ ఆసుపత్రి అయితే ఆ స్థాయిలోనే ఖర్చులు పెరుగుతాయి.

## సంతాన సాఫల్యం పేరుతో కోట్లు దోపిడీ

పిల్లలు లేని దంపతులను టార్గెట్ చేసి సోషల్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియాల ద్వారా కల్లబొల్లి కబుర్లు చెబుతూ అరచేతి లో వైకుంఠం చూపెడుతూ సంతానం అందేలా చేస్తామని చెప్పి కోట్లు గడస్తున్నా రు. ఇటీవల విశాఖలోని ఓ సంతాన సాఫల్యం కేంద్రంవారు రెండు లక్షల రూపాయలు డిపాజిట్ చేస్తే కవల పిల్లలు పుట్టేలా చేస్తామని నమ్మబలికి రెండు రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న వైనం వెలుగు లోకి వచ్చింది. అక్కడ చికిత్స పొందు తున్న వారికి పిల్లలు పుట్టకపోగా సైడ్ ఎఫెక్ట్స్ వస్తున్నాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తూ పోలీసులను ఆశ్రయించారు.

## డెంగ్యూ కార్పొరేట్ కాటు

గత రెండు మూడు సంవత్సరాలుగా కరోనా బాధితులను పీల్చి పిప్పి చేసిన అనేక ప్రైవేట్ ఆసుపత్రిలు ప్రస్తుతం డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికున్ గున్యా రోగుల జేబులు గుల్ల చేస్తున్నాయి.


సుమారు యాభై వేల నుండి రెండు లక్షల వరకు వసూలు చేస్తూ రోగులను ఆర్థిక ఇబ్బందుల పాలు చేస్తున్నాయి. డెంగ్యూకు చాలా వరకు సాధారణ జ్వరానికి చేసే చికిత్స చాలని వైద్యులంటున్నారు. డెంగ్యూ లేకున్నా తప్పుడు రిపోర్టులను డయాగ్నస్టిక్ సెంటర్లు ఇవ్వడం, చికిత్స చేసి కాసులు గడిస్తున్నాయి కార్పొరేట్ ఆసుపత్రులు.

### స్టెంట్‌ల ధరలు తగ్గినప్పటికీ..

కరోనరీ స్టంట్ ధరలు తగ్గినప్పటికీ, భారత్‌లోని ఆసుపత్రులు పూర్తి ప్రయోజనాన్ని రోగులకు అందించడం లేదని, స్వదేశీ, విదేశీ స్టంట్ తయారీదారులు పేర్కొన్నారు. స్టెంట్‌లకు గరిష్ట ధరలు నిర్ణయించాలని నేషనల్ ఫార్మస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ నిర్ణయించింది. అయితే ప్రతిపాదిత ధరల నియంత్రణ తయారీదారుల స్థాయిలో వర్తింపజేయడం జరుగుతుంది. కానీ చికిత్స అందించే హాస్పిటల్స్ ధరల నియంత్రణ పాటించడం లేదని తయారీదారుల ఆరోపణ. ఇదిలా ఉండగా దేశీయ స్టెంట్ తయారీదారులపై ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులు స్టెంట్‌లపై అధిక ప్రింటెడ్ ధరలు ముద్రించాలని ఒత్తిడి తేవడం జరుగుతుందని, అరవై వేల రూపాయల స్టెంట్ ధరను లక్ష రూపాయలుగా ప్రింటెడ్ ధర ముద్రిస్తే, ఆ ధరపై ఇరవై శాతం తగ్గింపును అందిస్తూ రోగులకు ఎనభై వేలకు స్టెంట్ అందజేయడం జరుగుతుంది. భారతదేశ మార్కెట్లో విదేశీ, స్వదేశీ కంపెనీల డజన్లకొద్ది స్టెంట్లు ఉన్నాయి. వీటి ధరలు దాదాపు ఇరవై ఐదు వేల నుండి రెండు లక్షల వరకు ఉంటాయి. ఐఎంఎస్ హెల్త్ మార్కెట్ పరిశోధన, విశ్లేషణ సంస్థ చేసిన అధ్యయనం ప్రకా రం తక్కువ తయారీ ఖర్చుల ఫలితంగా గత ఐదేళ్లలో తయారీదారులు డిస్ట్రిబ్యూటర్లు ధరలను ముప్పై నాలుగు శాతం తగ్గించగా, డిస్ట్రిబ్యూటర్లు ఆస్పత్రుల ధరలను 61 శాతం తగ్గించగా, ఆసుపత్రులు రోగులకు 43 శాతం మాత్రమే తగ్గించి అందిస్తున్నాయని అధ్యయనంలో తేలింది. తగ్గిన ధరల ప్రయోజనాలు ఆసుపత్రులకు అందినా, ఆ ప్రయోజనాలు పూర్తిగా ఆసుపత్రుల ద్వారా రోగులకు అందడం లేదు. చికిత్సకు ముందే నగదు డిపాజిట్ చేస్తేగానీ ట్రీట్‌మెంట్ ప్రారంభం కాదు. వైద్యం కోసం ఆసుపత్రి స్థాపించి రోగులకు సేవలు అందించే కాలం పోయింది. ప్రస్తుతం అరువు వైద్యలను నియమించుకొని, అవసరమైతే అంతగా అర్హత లేని వైద్యులతో చికిత్సలు చేయిస్తూ, ఆర్ఎంపి., పి.ఎంపి, అంబులెన్స్ డ్రైవర్స్, పిఆర్‌ఓల వ్యవస్థ సాయంతో వ్యాపారం చేసే పరిస్థితులు దాపురించడం వైద్య రంగానికే కళంకం. దీంతో ప్రైవేట్ ఆస్పత్రుల తీరుపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కూడా ఆసుపత్రులా? రియల్ ఎస్టేట్ సంస్థలా? అని ఆగ్రహం వ్యక్తం చేసిందంటే వాటి పనితీరు, దోపిడీ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.



కష్టకాలంలో ప్రజలకు సేవలు అందించాల్సింది పోయి పక్కా రియల్ సంస్థల్లా ప్రవర్తిస్తున్నాయని, నివాస ప్రాంతాల్లో రెండు మూడు పడక గదుల్లో, ప్లాట్లలో నర్సింగ్ హోమ్‌లు కొనసాగుతున్నాయనీ, కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా రోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని, అగ్నిప్రమాదాలు సంభవించి రోగుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయనీ, అటువంటి వాటిని తక్షణమే మూసివేయాలనీ, ప్రస్తుత చీఫ్ జస్టిస్ డివై చంద్రచుడ్ నాయకత్వంలో అప్పటి సుప్రీం ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ప్రైవేట్ ఆస్పత్రిలో చేరడం సామాన్య ప్రజానీకానికి ఎల్లప్పుడూ ఆందోళన కలిగించే అంశమే. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతివారి జేబులకు చిల్లులు పడటం ఖాయం. ఇంటర్నేషనల్ పీర్ రివ్యూడ్ జర్నల్, హెల్త్ ఎకనామిక్స్ రివ్యూలో పబ్లిష్ చేయబడిన ఇండియన్ ఇన్ అవుట్ ఆఫ్ టెక్నాలజీ ఐఐటి జోద్‌పూర్‌వారు నిర్వహించిన అధ్యయనం ప్రకారం భారతదేశంలోని ఓ సామాన్య కుటుంబం వ్యాధి సోకి ఆసుపత్రిలో చేరితే అదే వ్యాధికి, అదే సమయంలో ఆస్పత్రిలో ఉన్నందుకు ప్రభుత్వాసు పత్రిలో అయ్యే ఖర్చు కన్నా దాదాపు మూడు రెట్లు ఎక్కువగా ప్రైవేటు ఆసుపత్రిలో ఖర్చవుతుంది. పబ్లిక్ హెల్త్ కేర్‌తో ఒక రోజుకు అయ్యే ఖర్చు రూపాయలు 2833 అయితే, అదే ప్రైవేటు రంగంలో ఒక రోజుకి అయ్యే ఖర్చు రూపాయలు 6788 అవుతుందని అధ్యయనంలో తేలింది. ప్రైవేట్ ఆసుపత్రులు 100 శాతం కంటే ఎక్కువ లాభాన్ని ఆర్జిస్తున్నాయని అధ్యయనం తెలిపింది. ఇంత జరుగుతున్నా ప్రైవేట్ ఆస్పత్రులలో ధరలు విపరీతంగా పెరుగుతున్నా, ప్రజలంతా ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల వైపే మొగ్గ చూపుతున్నారంటే వైద్యం నాణ్యమైనదిగా ఉంటుందని, సేవలు సౌకర్యవంతంగా, హాస్పిటల్స్ అత్యంత పరిశుభ్రంగా ఉంటాయనీ, డబ్బు పోయినా అత్యుత్తమ సేవలు, వైద్యం లభిస్తుందని ప్రజలు నమ్మడమే. వాస్తవానికి ప్రభుత్వాసుపత్రులతో పోలిస్తే పరిశుభ్రత, సేవల విషయంలో కార్పొరేట్ ఆసుపత్రులు ముందంజలో ఉన్నాయి. కొన్ని కొన్ని హాస్పిటల్స్‌లో రోగుల సౌకర్యార్థం లిఫ్ట్, ఎక్సలేటర్ సౌకర్యాలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఎన్ని సౌకర్యాలు ఉంటే అంత భారం రోగులపై మోపుతుండటం, డాక్టర్లు కాని పెట్టుబడిదారులు, ఆస్పత్రులు నెలకొల్పి వైద్యరంగంలోకి వ్యాపారులుగా ప్రవేశించడంతో వైద్యం సేవల రంగం నుండి వ్యాపార రంగానికి మారింది. ప్రైవేట్ ఆస్పత్రులలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రులో జనం పెరిగారు. అయితే ప్రభుత్వం స్థాపించిన పల్లె దవాఖానాలకు, బస్తి దవాఖానాలకు ఆదరణ పెరిగింది. వాటిలో ఔట్ పేషెంట్లు రోజురోజుకు పెరుగుతున్నారు.



గవర్నమెంట్ దావాఖానాలలో మైనర్, మేజర్ సర్జరీలు పెరిగాయి. వీటిలో అనుభవం గల, అర్హతలు గల వైద్యనిపుణులు ఉంటారని ప్రజలకు నమ్మకం కలిగింది. ఆసుపత్రిలలో జనం పెరిగినంతగా సదుపాయాలు పెరగలేదు. పోగా సిబ్బంది కొరత, పరికరాల కొరత, మందులు లేమితో సర్కార్ ఆసుపత్రుల నాణ్యమైన సేవలను అందించడంలో వెనకబడి ఉన్నాయి. ప్రభుత్వ దవాఖానాలలో ఓపిగదులు, బ్లడ్ బ్యాంక్స్, మార్చురీ రూమ్స్, మెడికల్ ల్యాబ్స్, డయాగ్నస్టిక్ సెంటర్లు, వాష్రూమ్‌ల నుండి ఆపరేషన్ థియేటర్ల వరకు సరైన వసతులు లేకపోవడం, చాలినం తగా పడకలు లేకపోవడం పేషంట్ల సంఖ్య కనుగుణంగా నర్సింగ్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, ఫార్మసిస్టుల కొరత, ల్యాబ్ టెక్నీషియన్ల కొరతతో పాటు అన్ని విభాగాలకు చెందిన డాక్టర్ల కొరత విపరీతంగా ఉండటంతో పేద ప్రజలకు టెక్నీషియన్ల



కొరతతోపాటు అన్ని విభాగాలకు చెందిన డాక్టర్ల కొరత విపరీతంగా ఉండటంతో పేద ప్రజలకు అనుకున్నంతస్థాయిలో వైద్య సౌకర్యం లభించడం లేదు. పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందిస్తున్న ఉస్మానియా, నీలోఫర్, గాంధీ దవఖానాలలో పరిస్థితి దయనీయంగా ఉంది. ఒకే పడకపై ఇద్దరు, ముగ్గురిని పడుకోబెట్టి చికిత్స చేయడం, భవనాలు శిథిలావస్థలో ఉండటం, మరుగుదొడ్లు దారుణంగా ఉండడం స్థలాభావం వల్ల రోగులు, వైద్యులు ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర గవర్నర్ ఆందోళన చెందారు. తక్షణమే నూతన భవనాలను నిర్మించి తగు సౌకర్యాలు మెరుగయ్యేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు అంటే తాజాగా సర్కార్ ఆస్పత్రిలో



పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వరంగం ప్రజలను ఆదుకోవాల్సిన రీతిలో ఆదుకోవ డం లేదు. వైద్యం చేయించుకోవడానికి ముఖ్యమంత్రి సహాయనిధికి వేలసంఖ్యలో దరఖాస్తుల వెల్లువా, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు తమ తమ నియోజక వర్గాలలోని ప్రజల దరఖాస్తులను నింపటానికి, హైదరాబాద్‌లో అందజేయడా నికి ముగ్గురు, నలుగురు సిబ్బందిని నియమించుకున్నారంటే వాటి ప్రాముఖ్యత ఏంటో విధితమవుతుంది. నేషనల్ క్వాలిటీ ఆస్యూరెన్స్ స్టాండర్డ్ (ఎన్క్వాస్)లో రెండు రాష్ట్రాలకు చోటు దక్కినప్పటికీ, దేశంలో 320 పీహెచ్సీలతో, ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో 114 పీహెచ్సీలతో ఐదవస్థానం లో తెలంగాణలు ఉన్నప్పటికీ అనారోగ్యం తో బాధపడుతున్న ప్రజలకు సర్కారు దవాఖానాలలో పడకలు ఎందుకు దొరకడం లేదో అర్థం కాని పరిస్థితి. తెలం గాణలో కన్నా ఆంధ్రప్రదేశ్‌ల్లో కొంత మెరుగు గానే కనిపిస్తున్న ప్పటికీ, ఇతర రాష్ట్రాలలో దేశ వ్యాప్తంగా సైతం ప్రజా ఆరోగ్యం ఆందోళనకరంగానే ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినప్పటికీ తెలంగాణ సిద్ధించి తొమ్మిది ఏళ్ల పూర్తయి అమృత్యవోత్సవాలు దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నప్పటికీ అంబు లెన్స్ సౌకర్యం లేని ప్రాంతాలు సూది మందు గోలిలేని ఆసుపత్రులు, ఈ ఆధు నికి కాలంలో వైద్యం అందక ప్రసవవేదన తో బాధపడుతున్న మహిళామూర్తులు కన్నుమూసిన హృదయ విధారక ఉదం తాలు ఉండటం గమనార్హం.

**దేశంలో జాతీయ ఆరోగ్య విధానం, జాతీయ వైద్య కమిషన్ల నిబంధనలు ఏమి చెబుతున్నాయి?**

నేషనల్ హెల్త్ పాలసీ ప్రకారం ప్రజలు ఎవరు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవా ల్సిన అవసరం లేకుండా మంచి నాణ్య మైన ఆరోగ్య సంరక్షణ సేవలను విశ్వ వ్యాప్తంగా పొందడం, ప్రజారోగ్య వ్యాయాన్ని స్థూల జాతీయోత్పత్తిలో 2.5శాతంకి పెంచడం, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థల సామర్థ్యాన్ని, ఫలితాలను మెరుగుపరచడానికి డిజిటల్ సాధనాలను విస్తృతం చేయడం, మరణాల సంఖ్య, ఆయుష్ ప్రమాణాలు పెంచడం, రోగాలు రాకుండా చూడడం లక్ష్యంగా ఏర్పరుచు కోవడం జరిగింది. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం ప్రైవేట్ ఆసుపత్రిలో ఫీజులు రోగులకు అందు బాటులో ఉండాలని, డాక్టర్ ఫీజు, కన్సల్టేషన్ ఫీజు రిఫండ్ పేరిట ఫీజులు వసూలు చేయకూడదని అలాంటి వాటికి రోగికి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఫార్మసిటికల్ కంపెనీల నుంచి డాక్టర్లు ఎలాంటి బహుమతులు పొందకూడదని ఆ వివరాలతో ఐదేండ్లకు ఒకసారి అఫిడవిట్ సమర్పించాలి. రోగుల విషయంలో నైతిక నియమాలను సరిగ్గా పాటించకపోతే లైసెన్స్ సస్పెండ్ చేయవచ్చు. ఇలా పలు నిబంధనలు ఉన్నా, వాటిని అమలు పర చడంలో పాలకుల ఉదాసీన వైఖరితో పరిస్థి తుల్లో ఎలాంటి మార్పులు ఉండడం లేదు.

**పరిష్కార మార్గాలు**

ప్రస్తుతం విద్యావైద్యం చాలా ఖరీదుగా మారాయి. ఆసుపత్రిల బిల్లులు చెల్లించా లంటే ఆస్తులను తెగనమ్మాల్సిందే. కార్పొరేట్ వైద్య ఖర్చులు భరించలేనంతగా ప్రజలను ఆర్థికంగా కుదేలు చేస్తున్నాయి. వీటిని తక్షణమే తగ్గించడానికి చర్యలు చేపట్టాలి. ఒకప్పుడు మనదేశంలో కుటుంబ వైద్యుల విధానం ఉండేది. ఇప్పుడు దాదాపు కనుమరుగైంది. కుటుంబ డాక్టర్లపై కార్పొరేట్ నీలినీడలు కమ్ముకు న్నాయి. ఇది సమాజానికి ప్రమాదకరం. ఎంబిబిఎస్ చేరేవారికి, యువడాక్టర్లకు కుటుంబ వైద్యవిధానంపై సరైన అవగాహన కల్పించాలి. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో అనేక ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు,



ఏరియా ఆసుపత్రిలో కనీస వసతులు లేక ప్రజారోగ్యం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటుంది. ఇటీవల పల్లె, బస్తీ దవాఖానాలు ప్రారంభించినప్పటికీ జనాభాతో పోలిస్తే తక్కువగానే ఉన్నాయి. మండల కేంద్రాల్లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు నియోజకవర్గ కేంద్రాల్లోని ఏరియా ఆసుపత్రిలో అతిముఖ్యమైన గైనకాలజీ పీడియాట్రిక్ట్ సర్జన్, జనరల్ మెడిసిన్ తదితర పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి. ఆరోగ్య రంగానికి బడ్జెట్ కేటాయింపులు తగ్గిస్తూ వస్తుంది. 2023-24 బడ్జెట్లో రూపాయలు 92803 కోట్లు కేటాయించగా 2022-23లో 89251 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్ కన్నా 3552 కోట్లు పెంచినట్లు కనిపించినను ద్రవోల్బణం దృష్టా కేటాయింపులు రెండుశాతం తగ్గాయి. ఈ ఆరోగ్య దేశ జీడీపీలో 0.3శాతం బడ్జెట్లో రెండుశాతం కన్నా తక్కువగా ఉంటాయి. కనుక డబ్ల్యూహెచ్‌వో గైడ్లైన్స్ ప్రకారం దేశ జీడీపీలో కనీసం ఐదుశాతం ఆరోగ్యరంగానికి కేటాయించాలి.




ఆరోగ్యరంగంలో పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలి, పరిశోధనరంగానికి అధిక నిధులు కేటాయించాలి. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ప్రభావిత ప్రాంతాలలో గిరిజన ఆదివాసి పల్లెలలో ఆరోగ్యసంరక్షణ చర్యలో భాగంగా ఆరోగ్యపరిరక్షణ అవగాహన చైతన్య సదస్సులు నిరంతరం నిర్వహిస్తూ ఉండాలి. దోమకాటు ద్వారా సంభవించే మలేరియా డెంగూ, చికున్ గున్యా వ్యాధులు భారత్‌లోనే అధికం. ముఖ్యంగా కలరా, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ లాంటి వ్యాధుల పట్ల చికిత్స, నివారణ మార్గాల పట్ల అప్రమత్తం చేయాలి. ప్రభుత్వ ఆసుపత్రులన్నిటిలో డెంగ్యూ చికిత్సను అందించేందుకు అన్ని సదుపాయాలు సమకూర్చాలి.

**ది బేవరిడ్జ్ మోడల్ అనగా..**

ఈ బెవరిడ్జ్ వ్యవస్థలో ఆసుపత్రులను ప్రభుత్వ అధీనంలోనే ఉండాలి. వైద్యులందరూ ప్రభుత్వ ఉద్యోగులుగానే పనిచేస్తారు. చాలా తక్కువశాతంలో ప్రైవేట్ ఆస్పత్రులు ఉంటాయి. ఇవి వ్యవస్థలో చికిత్స పొందిన రోగి ఆసుపత్రులకు ఫీజు చెల్లించిన అవసరం లేదు. రోగులు పొందే చికిత్సకు ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తుంది. ప్రజల నుంచి పన్నుల రూపంలో తీసుకొని ఆ డబ్బునే ఆరోగ్యసంరక్షణ వ్యవస్థతో ఖర్చు చేస్తుంది. ఆసుపత్రులలో చికిత్సకు అయ్యే ఖర్చును ప్రభుత్వం నిర్ణయించడం, ఫార్మసిటికల్ కంపెనీ పైన నియంత్రణ ఉండటంపై మందులను కూడా పెద్దగా ఖర్చు ఉండదు. బ్రిటన్, స్పెయిన్, న్యూజిల్యాండ్, డెన్మార్క్‌లోనీ విధానం అమలులో ఉంది.

**ముగింపు**

దేశం ఒక ఆర్థిక సూపర్ పవర్‌గా విశ్వగురువుగా ఐదు ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ కలిగినదిగా ఆవిర్భవిస్తుందంటూ పెద్దలు ప్రచార పటాటోపంలో మునిగి తేలుతున్న, మన ఆరోగ్య వ్యవస్థ పరిస్థితి ఆధ్వాన్నంగా ఉందని కొవిడ్ కాలం రుజువు చేసింది. మనదేశ స్థూలజాతీయోత్పత్తిలో ఎంతశాతం ఆరోగ్యం మీద ఖర్చు చేస్తున్నాం అన్నది కొలమానం. దేశ జిడిపి పెరిగినంతగా ప్రజల ఆరోగ్యం కోసం ఖర్చు పెంచడం లేదు. తిరోగమనంలో రోజురోజుకు ప్రజా ఆరోగ్యంపైన చేసే ఖర్చు తగ్గిస్తుంది. ఆరోగ్య సంరక్షణ అనేది దేశంలో అతిముఖ్యమైన విభాగం. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ అనేది కేవలం వ్యాధి నివారణ, పరీక్షలకు చికిత్సలకే కాదు, ఆరోగ్యం మెరుగుపడే విధంగా పనిచేయాలి. భారతదేశ ఆరోగ్య విధానం ప్రధానంగా ఆరోగ్యసదుపాయాలు ప్రైవేట్ రంగంలో అందించడంపై విపరీతమైన శ్రద్ధ కనుపరిచాయి. ప్రైవేట్ రంగానికి ప్రాధాన్యత అనగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రైవేట్ రంగవారికి ఔట్సోర్సింగ్, ఆరోగ్యబీమా పాలసీలలో ప్రైవేట్ రంగానికి స్థానం కల్పించడం ఆందోళన కలిగిస్తుంది. ఆరోగ్యం కోసం ప్రభుత్వవ్యయాన్ని తగ్గించి ప్రైవేట్‌రంగానికి స్థానం కల్పిస్తే ప్రజారోగ్యం కొనసాగడం సాధ్యం కాదు. విద్యాహక్కులాగా ఆహార భద్రత హక్కులాగా ఆరోగ్యహక్కు ప్రస్తావన లేక పోవడం బాధాకరం. ఆరోగ్యాన్ని కాపాడు కోవాల్సింది ప్రజలు. ఆరోగ్య సంరక్షణలో అన్నిటికన్నా ముఖ్యమైనది కీలకమైనది మన జీవనశైలే. మంచి ఆహారం, బరువు అదుపులో ఉంచుకోవడం, కంటినిండా నిద్ర, క్రమంతప్పకుండా వ్యాయామం, నడక, దురలవాట్లకు దూరంగా ఉండడం, మనసు ప్రశాంతంగా ఉంచుకోవడం చేయాలి. అప్పుడప్పుడు వైద్యపరీక్షలు బిపి. మధుమేహం, కొలెస్ట్రాల్, లివర్‌ఫంక్షన్, కిడ్నీ టెస్టులు, వీటితోపాటు పాప్స్మియర్, మెమోగ్రాఫ్ పరీక్షలు చేయించుకొని అప్రమత్తంగా ఉండాలి. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రజలు, పాలకవర్గం విద్యావైద్యాన్ని ఉచితంగా అందించడానికి ప్రభుత్వ విద్యను ప్రజారోగ్యాన్ని బలోపేతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజాసంక్షేమం కోసం చేస్తారని ఆశిద్దాం. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆదర్శవంతమైన ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుంది. ❑











# భూగర్భంలో హోటల్

**యూకేలో** నార్త్‌వేల్స్‌లో ఎరారీ నేషనల్ పార్క్‌లోని స్నోడోనియా పర్వతాల కింద ఉంది ఈ హోటల్. భూగర్భంలో ఏకంగా 1,375 అడుగుల దిగువున ఉంది. అందుకే ఈ హోటల్ ప్రపంచంలోనే అత్యంత లోతుగా ఉండే హోటల్‌గా గుర్తింపు పొందింది. దీని పేరు 'డీప్ స్లీప్'. ఈ హోటల్‌కు వెళ్లడమే ఓ అడ్వెంచర్. ఎరారీ నేషనల్ పార్క్‌లో పర్వతాల కింద ఉండే ఈ హోటల్‌లో క్యాబిన్‌లు, రూమ్‌లసెటప్ అదిరిపోతుంది. ఈ హోటల్‌లోకి వచ్చేక అక్కడ ఉన్న ఆతిథ్యాన్ని చూసి అక్కడకి చేరుకోవడానికి పడ్డ కష్టాన్ని మర్చిపోతారు. ఇందులో ట్విన్ బెడ్‌లతో కూడిన నాలుగు క్యాబిన్‌లు, డబుల్ బెడ్‌తో ప్రత్యేక గుహలాంటి రూములు అతిథులను మంత్రముగ్ధుల్ని చేస్తాయి. ఇక్కడ ఏడాది పొడవునా 10 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉన్నప్పటికీ క్యాబిన్‌లకు థర్మల్ లైనింగ్ ఉండటంతో వెచ్చగానే ఉంటుంది. అయినప్పటికీ ఈ అండర్ గ్రౌండ్ హోటల్‌లో బస చేసేందుకు వెచ్చగా ఉండే దుస్తులనే ధరించాల్సి ఉంటుంది. ఆ హోటల్ కేవలం రాత్రిపూట బస చేయడానికి అతిథులను ఆహ్వానిస్తుంది. అదికూడా కేవలం శనివారం రాత్రి నుంచి ఉదయం వరకు మాత్రమే అక్కడ బస. ఈ హోటల్‌కి చేరుకోవడం అలాంటి ఫీట్ కాదు, ఓ సాహసయాత్ర. మొదటగా పర్యాటకులు పర్వతాల మీదకు కాలినడక శిఖరాన చేరుకున్న తర్వాత హోటల్ నిర్వాహకులు భూగర్భంలోకి వెళ్లడానికి కావాల్సిన హెల్మెట్, లైట్, బూట్లు ఇతరత్రా వస్తువులకి సంబంధించి సంరక్షణ కిట్‌ని ఇస్తారు. వాటిని ధరించి గైడ్ సమక్షంలో బండరాళ్లవెంట ట్రెక్కింగ్ చేసుకుంటూ మెట్ల బావులు, వంతెనలు దాటుకుంటూ కఠిన దారుల వెంట ప్రయాణించాలి. అలా ప్రయాణించక పెద్ద ఐరన్ డోర్ వస్తుంది. కానీ ఇక్కడకు పిల్లలకు మాత్రం 14 ఏళ్లు దాటితేనే అనుమతిస్తారు. ఇక ప్రైవేట్ క్యాబిన్‌లో ఇద్దరికి బస రూ.361 వేలు కాగా, గుహ లాంటి గదికి రూ.56 వేలు వెచ్చించాల్సి ఉంది. అయితే ఇక్కడకు వచ్చే పర్యాటకులు మాత్రం ఇంత పెద్ద సాహసయాత్ర చేసి ఆ హోటల్‌లో బస చేయడం ఓ గొప్ప అనుభూతి అంటున్నారు. అంతేగాదు తమ జీవితంలో మంచి నిద్రను పొందామని ఆనందంగా చెబుతున్నారు పర్యాటకులు.





## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:

**ఎడిటర్, ఆదివారం వార్త**, నం.396,

లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080.

sunmagvaartha@gmail.com



# మా బాపు

అస్సె* దించినంక
పిస్సె* లకెల్లి తీసిచ్చిన
చారాణ బిళ్ల
వాసన ఎర్కయింది.
కానీ.. ఆ అస్సె మోసిన
మా బాపు భుజం మీద
కాసిన కాయ కానరాలే.
...
గంపెడు మంది
పుట్టెడు అప్పులు
ఎన్నడూ ఎలి పడలే
పరుషాన్ అస్సలే కాలే
కన్నకొడుకునేగానీ
నీ ఓపికను
పావులెత్తన్నా
పంచుకోకపోతి బాపూ!
...
లెక్కలల్ల మీ వోడు
బగ్గ వుషారు అని
అంతయ్యసారు
బాపుతోటి అంటే
గల్లెగురేసిన..
నా లెక్కల బంగ్లకు
బున్యాది మా బాపే అని మరిసిన.
...
ఎనుమందుగురం
పుట్టినంగానీ
పల్లెత్తు మాటనలే
ఎన్నడూ ఒల్ల మీదికీ
కైక్కుమనలే.
అప్పో సప్పో జేసి
కుటుంబపు బర్వును
అల్కగ మోసిన
గా సుట్టబట్ట
ఏ సూరుల పెట్టినవో
పత్త జెప్పవా బాపూ?
...
ఏం సదుకున్నదో
ఎన్నడూ జెప్పలే
బాపుకు తెల్వని
శాత్రం లేదు
బాపు సెయ్యలేని
లెక్కలు లేవు
గదే గొంత అంటినందుకు
నాదీ నా కొడుకులదీ
తెల్లమొకమేంది.
...
నాకు ఓనమాలు రాకముందే
ఓపికతోటి బుదిరికిచ్చి
బుర్రకాయ కట్టి
ఈత నేర్పిచ్చినవ్ బాపూ
సంసార సాగరంను సుత
సర్రాసుగ ఈదేటట్టు
...
బెల్లం ఆనకం
పట్టాలంటే నువ్వే
బోంది కొట్టి
లడ్డూలు కట్టాలంటే నువ్వే
ఏ తంటా లేకుంట
వంటలన్నీ సేత్తుంటివి బాపూ.
కమ్మటి బతుకు రుచిని
ఆనాడే సూపిత్తివి బాపూ!

(*అస్సె=భుజాల మీదుగా రెండు
వైపులా వేలాడే సంచి)
(* పిస్సి=సంచి)

**- అల్లాడి శ్రీనివాస్**

## ఈవారం కవిత్వం

# తొలకరి



మండుటెండల గ్రీష్మ తాపానికి
మిట్ట మధ్యాహ్నం భానుడి భగ భగలకి
తనువు ఒర్చిన సెగలన్నింటికి
మబ్బులు మోసుకొచ్చిన చల్లని సందేశం
తొలకరి! నెర్రలు వారిన నేల మీద
మట్టివాసనను తట్టి లేపి
భూమి నరాల్లోకి ప్రాణంగా ప్రవహించి
రైతు ముఖంపై విరిసిన దరహాసం తొలకరి!
కాలువలుగా విస్తరించి.. విస్తరించి
వానా-వానా వల్లప్పంటూ
ఆట పాటలను మెప్పించేందుకు
బాల్యం మోసుకొచ్చిన పడవల ప్రవాహం తొలకరి.
వడలిపోయి వాడిపోయిన పచ్చదనానికి
ఓడిపోతూ ఎదురు చూస్తున్న లోగిళ్లకు
మరల జీవం పోసుకోవడానికి
ప్రకృతి చేసిన సంతకం తొలకరి.

**- డా॥ వాసాల వరప్రసాద్**

# కొత్త కవితాప్రక్రియ



తెలుగు వచన కవిత్వం రోజురోజుకూ కొత్తపుంతలు తొక్కుతున్నది. కవిత్వం, నానీలు, హైకూలు, మొగ్గలు ఇలా వర్ధమాన కవులు కవిత్వంలో కొత్త బాటలు వేస్తున్నారు. ఇలాంటి ప్రక్రియే సుధామ సృష్టించిన సప్తపదులు. ఇందులో 3 పాదాలుంటాయి. మొదటి రెండు పాదాలు ఏకపద వాక్యం. మూడవపాదంలో 5 పదాలుంటాయి. 1+1+5 వెరసి 7 పదాలు. అందుకే సృష్టికర్త సుధామగారు సప్తపది (7పదాలు) అన్నారు. మూడు పాదాలకు అంత్యప్రాస ఉండాలి. అనతికాలంలోనే అనేకులు స్పందించారు. 'ఒక్కసారి చూడండి అంతే!' అనబడే వాట్సాప్‌గ్రూపులో వందలకొలది సాహితీ ప్రియులు తమ సప్తపదులను పంపారు. స్పందించిన ప్రముఖులలో శ్రీవిహారి ఒకరు. కథ, కవిత, ఛందోబద్ధ పద్యం అన్నింటా విహారి అందె వేసిన చేయి. సప్తపదులు 116 మొట్టమొదటి సంపుటిగా తీసుకువచ్చిన ఘనత వీరికి దక్కుతుంది. ఈ సప్తపదుల సంపుటి 116లు పఠితలను ఆలోచింపచేస్తాయి. సామాజిక వర్తమానతని, తాత్త్వికతని, మానవీయ విలువల్నిప్రతిబింబిస్తాయి. మచ్చుకు కొన్ని సప్తపదుల్ని పరిశీలిద్దాం. 'శిక్షణా, క్రమశిక్షణ! రెండూ మన భవితకు సదా సంరక్షణ' మరొకటి. 'అనురాగం, అనుభోగం, శృతిమించితే ఫలితం వికృత సరాగం!' సప్తపది మొత్తానికి అర్థసమన్వయం అయి ప్రభోదాత్మకంగా ఉంటుంది. ప్రక్రియ ఏదైనా ఇచ్చె సందేశం గొప్పగా ఉండాలి. సప్తపదిలో కనిపిస్తున్నది ఇదే. ఆలోచనా ప్రేరకమై అనుభూతిదాయకమై అలరిస్తున్నాయీ సప్తపదులు. సృష్టికర్త సుధామ, మొదటి 116 రచనకర్తగా విహారి చరిత్రలో నిలిచిపోతారు. ఇరువురికీ హృదయాభినందనలు. త్వరలోనే ఇవి లక్షానూట పదార్లు అవుతాయి. సందేహం లేదు.

**(సప్తపదులు (నూటపదార్లు), రచన: విహారి (జె.యస్.మూర్తి), వెల: రూ 100, ప్రతులకు: ప్రముఖ బుక్‌హౌస్‌లలో)**

**- కూర చిదంబరం**

## పుస్తక సమీక్ష

# చల్లారని నిప్పు రవ్వలు




ప్రగతిశీల అభ్యుదయ వాదిగా, మహమ్మద్‌ఖాజా మైనద్దీన్ రాసిన 'చల్లారని నిప్పురవ్వలు' కవితా సంపుటిలో వివిధ పత్రికలలో, వివిధ సందర్భాలలోని 60 కవితలు ప్రచురింపచేసారు. తెలంగాణ సాయుధపోరాట నిప్పురవ్వలు ప్రతిగుండెలో ఇప్పటికీ చల్లారక ఎగసి పడుతూనే ఉన్నాయి అంటూ, సామాన్యుని జీవితం యాడేసిన గొంగడి ఆడనే సమానావకాశాలు ఊరిస్తున్నాయి అంటారు. సురవరం, సినారె, అంబేద్కర్, లెనిన్, శ్రీశ్రీ, జాషువా, గాంధీలపై స్మృతి కవితలు ఆకట్టుకుంటున్నాయి. 'అవినీతి అంతమే మనిషి పంతం కావాలి' ప్రశ్నించే గొంతులు పెరగాలని, ఓటర్లు ఓట్లను అమ్ముకోవడం మానేసినప్పుడే అవినీతికి ఆఖరిరోజులు' అంటూ ఓట్ల కొనుగోలుతో సాగుతున్న ధనస్వామ్యంపై ధ్వజం ఎత్తారు. మహమ్మద్ ఖాజా మైనద్దీన్ కవితలలో నైతిక సామాజిక స్పృహ, ప్రస్తుత సమాజ నడవడికపై ఆవేదన సృష్టిమవుతున్నాయి. కడగండ్ల రైతు చిత్రం, నల్లమలను కాపాడండి, వలస కార్మికుల గోస, కులపైత్యం నిష్క్రమిస్తేనే, ఓటు కోయిలపాట, మంటగలిసిన మానవత్వం వంటి కవితలు సమసమాజాన్ని ఆకాంక్షించే కవిగా అందాకా పోరుబాట తప్పదని, నిప్పురవ్వలు చల్లారవని ఈ కవితా సంపుటి ప్రగతిశీల అభ్యుదయవాదాన్ని ఆవిష్కరిస్తోంది.

**(చల్లారని నిప్పు రవ్వలు, రచన: మహమ్మద్ ఖాజామైనద్దీన్, వెల: రూ 50, ప్రతులకు: నవతెలంగాణ బుక్‌హౌస్. బాగ్‌లింగమ్‌పల్లి, హైదరాబాద్)**

**- యర్రమిల్లి**

# 'అభ్యుదయ సాహిత్య వ్యాసధార'



రచయిత, తన గురువు సముద్రాల గోపాలరావుకి ఈ వ్యాససంకలనం అంకితం చేసారు, (తన తల్లిదండ్రులకూ). 15 వ్యాసాలున్నాయి ఈ సంపుటిలో. ఠాంపల్లి రమేష్ చక్కని విలువైన ముందుమాట రాసారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ నాటి వీర తెలంగాణ సాయుధపోరాటంలో పాల్గొని, జైలు శిక్షలు అనుభవించిన ప్రజాకవి దాశరథి, గాలిబ్ గజళ్లను తెలుగులోకి అనువదించారు. అక్షరంతో అగ్ని'ధారలు' కురిపించాడు. తెలుగు సినిమాల్లో రెండువేల పాటలు రాసిన గొప్పకవిగా దాశరధి కృష్ణమాచార్యులను పరిచయం చేసాడు (పేజీ:22). 1942లో క్విట్ఇండియా ఉద్యమంలో చేరిన వట్టికోట ఆళ్వార్‌స్వామి, 1944లో భారత కమ్యూనిస్ట్ పార్టీలో సభ్యుడై తెలంగాణ పోరాటంలో పాల్గొని, 'ప్రజల మనిషి'లాంటి నవల రాసారు. ఇది తెలుగు సాహిత్యంలో గొప్పనవల. 1935-40 వరకు తెలంగాణ ప్రజాజీవితాన్ని నమోదు చేసింది. 'సుకవి జీవించే ప్రజల నాలుకల యందు' అన్న 'విశ్వనరుడు' జాషువా గురించి (పేజీ.29) రాసారు. కాందిశీకుడు కావ్యాన్ని బౌద్ధ తాత్త్వికతతో ప్రపంచశాంతి స్థాపనకై రాసారు జాషువా అంటారు. తెలంగాణ ఉద్యమ కాలంలో పాట, నవల, జానపద కళారూపాలు ఎంతో విస్తరించి, జనచైతన్యం నింపి ఎందరో కవులు కళాకారులుఉద్భవించారని సోమసుందర్, ఆరుద్ర, గంగినేని, కాళోజీ, దాశరధి, రెంటాల, కుందర్తి లాంటివారు బండి దయాగిరి, కె.ఎల్.నరసింహారావు, సుద్దాల, తిరునగరి లాంటివారు పాటలతో ఉత్తేజపరిచారని, బొల్లిముంత, లక్ష్మీకాంతమోహన్, దాశరధి, మహీధరలు నవలలు రాసారని 'సాయుధ పోరాటకుల సాహిత్య చైతన్యం' అంటూ చిన్నవ్యాసంలో పెద్ద చరిత్ర రాసారు (పేజీ.34). రేపటి తరం బాలబాలికలకు ఈ వ్యాససంకలనం రచయిత కృషి శ్లాఘినీయం. ఈ వ్యాసాలన్నీ వివిధ పత్రికల్లో ప్రచురణై ప్రజాదరణ పాఠకాదరణ పొందినవే.

**(ధార. సాహిత్యవ్యాసాలు, రచన: అనంతోజు మోహనకృష్ణ, వెల: రూ 150, ప్రతులకు: మోహనకృష్ణ, పద్మకాలనీ, ఐఎస్‌టి దగ్గర, హైదరాబాద్)**

**- తంగిరాల చక్రవర్తి**

# సంపన్న గ్రామాలు



**పల్లెటూరే** కానీ ఆ ఊళ్లో ఏ వీధిలో చూసినా ఓ జాతీయ బ్యాంకు శాఖ ఉంటుంది. సాధారణ రైతులుండే గ్రామాల్లో ఆ బ్యాంకుల్లో ఉద్యోగులకు పనేం ఉంటుందీ అనుకుంటే పొరపడినట్టే. ఇక్కడ నిత్యం లక్షలూ కోట్లల్లోనే లావాదేవీలు జరుగుతాయి. ఇక, డిపాజిట్లు అయితే ఒక్కో బ్యాంకులోనూ వందల కోట్ల రూపాయలుంటాయి.



అందుకే ప్రపంచంలోని సంపన్న గ్రామాల్లో అదీ ఒకటి అయింది. గుజరాత్‌లోని కచ్ జిల్లాలో దాదాపు డజనుకుపైగా సంపన్న గ్రామాలున్నాయి. వాటిన్నిటిలోనూ పలు జాతీయ బ్యాంకుల శాఖలున్నాయి. వాటిల్లో దాదాపు ఎనిమిది వేల కుటుంబాలున్న మాధాపూర్ ఆసియాలోనే సంపన్న గ్రామంగా పేరొందింది. బ్యాంకుల్లో ఉన్న ఈ గ్రామస్తుల సొమ్ము ఐదువేల కోట్ల రూపాయలట. దాని పక్కనే కేరా గ్రామంలో 1900 కుటుంబాలకు రెండువేల కోట్లు ఉంటే, మరో పక్కన ఉన్న బలాడియా అనే చిన్న పల్లెలో 1300 ఇళ్లకు మరో రెండువేల కోట్లు ఉన్నాయట. ఈ మొత్తం నిధుల్లో సగానికి పైగా ప్రవాసుల నుంచి వచ్చినవేనట. అదెలా జరిగిందీ అంటే సోలంకి రాజవంశానికి చెందిన మాధా కంజి సోలంకి పేరుమీదుగా ఏర్పాటైన గ్రామమిది. ఆ రాజవంశీయులే వందల ఏళ్ల క్రితం ఇక్కడ గుడులూ బడులూ చెరువులూ లాంటి మౌలిక వసతుల్ని ఏర్పాటుచేశారు. మంచి సారవంతమైన నేల కావడంతో మామిడి, ఖర్జూరం లాంటి పంటలు బాగా పండుతాయి. 1960వ దశకం నుంచి ఇక్కడి రైతులంతా సహకార సంఘంగా ఏర్పడి చేస్తున్న వ్యవసాయం సత్ఫలితాలనిచ్చింది. పంట దిగుబడిని ముంబయి తరలించి అమ్ముతున్నారు. హస్తకళకారులూ ఎక్కువగానే ఉన్నారు. వారిలో చాలామంది సొంతంగా చిన్నచిన్న వ్యాపారాలు పెట్టుకుని పెద్ద ఫ్యాషన్‌బ్రాండ్లకు తమ ఉత్పత్తులను సరఫరా చేస్తున్నారు. దాంతో ఈ గ్రామం అటు వ్యవసాయం, ఇటు వ్యాపారంతో నిత్యం సందడిగా ఉంటుంది. ఇక్కడ చదువుకున్న పిల్లలు పెద్దవాళ్లై అమెరికా, ఇంగ్లండ్, ఆఫ్రికా, గల్ఫ్ దేశాల్లో ఉద్యోగ, వ్యాపారాలు చేస్తున్నారు. అలా ఇక్కడి నుండి వెళ్లినవారు 1968లోనే లండన్‌లో 'మాధాపూర్ విలేజ్ అసోసియేషన్'ని ప్రారంభించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న మాధాపూర్ వాసులందరినీ సంఘటితపరచడం ఈ సంఘం ఉద్దేశం. తాము ఎక్కడ ఉన్నా తమ సంపాదనని సొంతూళ్లోనే దాచుకోవాలన్న నియమం పెట్టుకుని ఏటా పెద్ద మొత్తంలో డబ్బుని తల్లిదండ్రులకు పంపుతుంటారట. కొన్నేళ్ల తర్వాత తిరిగి సొంతూరికి వచ్చి ఆ డబ్బుతో ఇక్కడ వ్యాపారాలు ప్రారంభించినవారూ ఉన్నారు. ఈ పనులు సాఫీగా సాగడానికి సంఘం కార్యాలయం ఒకదాన్ని మాధాపూర్‌లో కూడా ఏర్పాటు చేశారు. దాంతో గ్రామస్తులందరూ ఇక్కడ తరచూ కలుసుకుంటూ ఉంటారు. ప్రపంచస్థాయి సౌకర్యాలున్న ఆస్పత్రి ఈ ఊళ్లో ఉంది. కొత్తగా తవ్విన చెరువులూ కట్టిన చెక్‌డ్యామ్‌లూ లాంటివాటి వల్ల ఏడాది పొడవునా మంచినీరు పుష్కలంగా లభిస్తుంది. పేరుకే గ్రామం కానీ ఎక్కడా గ్రామీణవాతావరణం కన్పించదు. కాంక్రీటు భవనాలూ వాటి ముందు పెద్దపెద్ద కార్లూ ఉంటాయి. ఊరి పెద్దలంతా బ్రాండెడ్, డిజైనర్ వాచీలు పెట్టుకుని, కస్టమైజ్‌డ్ స్మార్ట్‌ఫోన్లు పట్టుకుని కూల్‌గా కాలక్షేపం చేస్తుంటారు.

## జీవితాలను మార్చిన ఆపిల్ పంట

హిమాలయ సానువుల్లో ఉన్న ఆ కొండ ప్రాంతంలో కాలంతో సంబంధం లేకుండా ఎప్పుడు చూసినా తెల్లటి పరదాల మాటున దాక్కుని ఉంటుంది ఒక ఊరు. దాని పేరు మడావగ్. ఇదీ పల్లెటూరే. చేసేది వ్యవసాయమే. కానీ ఒక్కో కుటుంబం సాలీనా 75లక్షల రూపాయల ఆదాయం పొందుతూ 'సరిలేరు మాకెవ్వరూ' అంటూ సంతోషంతో పొంగిపోతోంది. హిమాచల్‌ప్రదేశ్ రాజధాని సిమ్లాకి 92 కి.మీదూరంలో కొండల్లో ఉంటుందీ ఊరు.

సముద్రమట్టానికి ఎంత లేదనా 7700 అడుగుల ఎత్తు. అంతా కలిసి రెండువేల జనాభా ఉంటుంది. కొన్నేళ్ల క్రితం వరకూ సిమ్లా ఆపిల్స్‌కి ప్రపంచ వ్యాప్తంగా మంచి క్రేజ్ ఉండేది. దాంతో మొదట సిమ్లా, ఆ తర్వాత క్యారీ అనే మరో గ్రామమూ ఆపిల్ ఎగుమతులతో దేశంలో సంపన్నమైన గ్రామాలుగా పేరు తెచ్చుకున్నాయి. ఇది నలభైఏళ్ల క్రితం సంగతి. అప్పుడు ఎగుడుదిగుళ్లతో ఉండే మడావగ్‌లో ఆపిల్స్ ఎవరూ పండించేవారు కాదు. 1990ల్లో హీర్‌సింగ్ డోగ్రా అనే రైతు కోట్‌ఖాయ్ ప్రాంతం నుంచి కొన్ని ఆపిల్స్ తెచ్చాడు. ఆ గింజల్ని తన పొలంలో నాటితే చెట్లు ఏపుగా పెరిగాయి. మంచి పంట కూడా



వచ్చింది. పండ్లను మార్కెట్‌లో అమ్మితే చాలా డబ్బొచ్చింది. కాయలు బాగున్నాయన్న పేరూ వచ్చింది. మొట్టమొదటిసారి ఆపిల్స్ కారణంగా ఆ రైతు కొన్నివేల రూపాయలను ప్రతిఫలంగా పొంది ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యాడు. అది మొదలు ఆ ఊరి వాళ్లందరి దృష్టి ఆపిల్ మీద పడింది. ఒకరికొకరు అండగా నిలిచి ఏటికేడాది ఆపిల్ సాగును విస్తరిస్తూ పోయారు. సాగులోని కష్టసుఖాలను పంచుకుంటూ మంచి దిగుబడి సాధించేందుకు కృషిచేశారు. చలికాలంలో రేయింబగళ్లు కాపలా కాస్తూ చెట్లమీద పడిన మంచును ఎప్పటికప్పుడు తొలగించేవారు. ఎండాకాలంలో ఒక్కసారి వడగళ్లు పడితేచాలు పంట మొత్తం నాశనం అయిపోతుంది. అందుకని ఆపిల్ తోటల మీద పరదాలు కట్టి కంటిపాపల్లా కాపాడుకుంటున్నారు. ఫలితంగా ఇప్పుడు ఇక్కడ పండే పండ్లు సైజులో పెద్దగానూ రుచిగాను ఉంటున్నాయి. దేశంలోనే అత్యంత నాణ్యమైన ఆపిల్ వెరైటీలు ఇక్కడ పండుతున్నాయి. విదేశాల్లో వీటికి మంచి డిమాండ్ లభిస్తుండడంతో మొత్తంగా పంటని ఎగుమతి చేస్తున్నారు. దాంతో పెద్దమొత్తంలో విదేశీమారకాన్ని ఆర్జించి పెడుతూ ఆపిల్ పండ్లు ఈ ఊరినే దేశంలోని సంపన్నగ్రామాల్లో ఒకటిగా చేశాయి.

## స్టాక్ ఎక్స్ఛేంజీలో ఒక పల్లె

పల్లె అంటే పాడీపంటా అనుకుంటాం కానీ ఫ్యాక్టరీలు ఫైవ్‌స్టార్ హోటళ్లూ హెలికాప్టర్ ట్యాక్సీల గురించి ఊహించను కూడా లేము కదా. కానీ గ్రామమే ఒక కంపెనీగా గ్రామస్థులంతా అందులో షేర్‌హోల్డర్లుగా కోట్లు సంపాదిస్తున్న ఊరు ఒకటుంది. అదే చైనాలోని హ్యాషీ, ప్రపంచంలోనే సంపన్న గ్రామం. పెద్దపెద్ద విలాసవంతమైన భవనాలూ రెండున్నర వేలకోట్లతో కట్టిన ఆకాశాన్నంటే టవర్లతో హ్యాషీ గ్రామం ఓ పెద్ద నగరంలా కన్పిస్తుంది కానీ నిజానికి ఈ గ్రామవాసులు రెండువేలమందే. 20వేలమంది వలసకార్మికులు. మరో 30వేల మంది చుట్టుపక్కల గ్రామస్తులు ఈ ఊళ్లో ఉన్న ఫ్యాక్టరీల్లో పనిచేస్తారు. వాళ్లంతా కూడా అక్కడి సౌకర్యాలను ఉచితంగా వాడుకోవచ్చు. అరవైఏళ్ల క్రితం వరకూ ఒక సాధారణ వ్యవసాయ గ్రామంగా ఉన్న హ్యాషీకి గ్రామాధికారిగా వచ్చిన వు రెన్‌బావో గ్రామస్తుల్నీ వాళ్ల ఆస్తుల్నీ సంఘటితపరిచి వ్యవసాయాన్ని అభివృద్ధి చేస్తూనే వారిచేత నట్లు తయారుచేసే పరిశ్రమ పెట్టించాడు. అది బాగా లాభాలార్జించింది. ఆ డబ్బుతో టెక్స్‌టైల్, స్టీల్‌లాంటి మరిన్ని పరిశ్రమలు పదుల సంఖ్యలో పెట్టి అందరూ కష్టపడి పనిచేసేలా చూశాడు. అక్కడ ఎవరూ ఒక్కరోజు కూడా సెలవు తీసుకోవడానికి వీల్లేదు. తమ ఆదాయాన్ని మళ్లీ అక్కడే పెట్టుబడిగా పెట్టాలి. ఎవరికైనా ఆ పద్ధతి నచ్చకపోతే అన్నీ వదిలేసి వెళ్లిపోవచ్చు. పట్టిందల్లా బంగారమైనట్లు సమష్టికృషి వేలకోట్లు సంపాదించిపెడుతోంటే ఎవరు మాత్రం వదులుకుంటారు. గ్రామంలోని పరిశ్రమలన్నిటినీ మల్టీసెక్టార్ ఇండస్ట్రీ కంపెనీగా స్టాక్ ఎక్స్ఛేంజిలో నమోదు



చేశారు. ఏటా వచ్చే ఆదాయంలో ఐదోవంతుని గ్రామస్తులంతా సమానంగా పంచుకుంటారు. అటు డబ్బుతో విలాసవంతమైన సౌకర్యాలను అనుభవిస్తూనే ఇటు కృషినీ కొనసాగిస్తూ వచ్చారు ఆ గ్రామప్రజలు. అక్కడ అందరికీ పెద్దపెద్ద ఇళ్లూ లగ్జరీ కార్లూ ఉంటాయి. అర్జెంటుగా ఎక్కడికైనా వెళ్లాలంటే హెలిక్టార్ ట్యాక్సీలుంటాయి. ప్రపంచంలో ఉన్న గొప్ప కళాఖండాలన్నిటికీ ప్రతిరూపాలను ఈ ఊళ్లో నిర్మించారు. అక్కడి ఫైవ్‌స్టార్ హోటల్లో ఏకంగా ఒక బంగారపు ఎద్దునే ప్రతిష్ఠించుకున్నారు. అటు సేంద్రియ వ్యవసాయంతో ఇటు నిరంతరం పనిచేసే ఫ్యాక్టరీలతో సిరిసంపదలకు కేరాఫ్ అడ్రసుగా కనిపిస్తూ మహానగరాల్నే తలదన్నే ఈ సోషలిస్టు గ్రామాన్ని చూడడానికి ఏటా లక్షలాది సందర్శకులు వస్తుంటారట. ❑



కథ

# కప్ప-కొంగ స్నేహం



ఒక మడుగులో కొన్ని చేపలు, కప్పలు ఉండేవి. అవి ఎంతో అన్యోన్యంగా ఉండేవి. ఆ కప్పలలో ఒక తెలివైన కప్ప ఉండేది. ఆ చేపలు, కప్పలు, తమకు ఏ ఆపద వచ్చినా దాని సాయం కోరేవి. అది వాటి సమస్యలను తన తెలివితో పరిష్కరించి ఆపద నుండి వాటిని గట్టెక్కించేది. ఇలా ఉండగా అక్కడకు చేపల శత్రువు అయిన ఒక పెద్ద కొంగ వచ్చింది. అది రాగానే చేపలన్నీ భయపడి ఆ కప్పకు తమ గోడును వెళ్లబోసుకున్నాయి. అప్పుడు కప్ప వాటికి అభయం ఇచ్చి ఆ కొంగ వద్దకు వచ్చి 'ఓ కొంగా! ఈ మడుగులోని చేపలను నీవు ముట్టవద్దు' అని అంది. అప్పుడు కొంగ 'నేను ఈ చేపల కొరకు రాలేదు. నీవు చాలా తెలివిగల దానివని విన్నాను. నీ స్నేహాన్ని కోరి వచ్చాను. నేను ఒక్క చేపను కూడా ముట్టను' అని అంది. అప్పుడు కప్ప సంతోషించి దానితో స్నేహం కొనసాగించింది.

ఒకనాడు ఆ కప్ప సంతానమైన చిన్న కప్ప 'అమ్మా! నాకు ఆకాశంలో ఎగరాలని ఉంది. కానీ నాకు రెక్కలు లేవు కదా! ఈ కొంగ నీ స్నేహితుడు! నన్ను తన పైన ఎక్కించుకొని ఒకసారి ఆకాశంలో తిప్పమని నీవు అడుగు' అని అంది. అప్పుడు ఆ పెద్ద కప్ప 'అది ప్రమాదభరితమైన కోరిక' అని తన బిడ్డకు వద్దని చెప్పింది. కానీ ఆ చిన్న కప్ప పదేపదే అడిగేసరికి తన బిడ్డ కోరిక కాదనలేక ఆ కప్ప సరేనని ఆ కొంగతో విషయం చెప్పింది.

అది సరేనని ఆ కప్ప పిల్లను తనపైన ఎక్కించుకొని ఆకాశంలోకి ఎగిరింది. కానీ ఎంతసేపైనా ఆ కొంగ తిరిగి రాలేదు. ఆ తల్లి కప్ప ఆందోళన పడసాగింది. అప్పుడే అక్కడికి వచ్చిన నక్క ఒకటి ఆ కప్పతో 'ఓ కప్పా! ఆ కొంగను నీవు నమ్ముతావా! అది మోసకారి. అది నీ బిడ్డను ఏమైనా చేస్తుంది' అని అంది. అసలే ఆందోళనలో ఉన్న ఆ కప్ప నక్క మాటలకు ఎంతో బాధపడింది. అప్పుడు చేపలు ఆ నక్కతో 'ఒకవైపు ఆ కప్ప ఆందోళనతో ఉంటే నీవు దానిని నీ మాటల చేత మరింత బాధ పెడతావా! తప్పకుండా దాని బిడ్డ తిరిగి వస్తుంది. ఆ కప్ప చాలా తెలివైనదైనప్పటికీ ఈ సమయంలో అది ఆందోళనతో ఉండి దానికి ఏమీ తోచడం లేదు. అటువంటి దాని బిడ్డ కీడును నీవు శంకిస్తావా!' అని నక్కపై కోపగించాయి. ఆ తర్వాత ఆ కప్ప ఏడవ సాగింది. ఇంతలో ఆ కొంగ తిరిగి రావడం చూసి ఆ పెద్ద కప్ప, చేపలు ఎంతో సంతోషించాయి. ఆ కొంగ వచ్చింది కానీ దానిపైన ఆ చిన్న కప్ప లేదు. ఆ కప్ప కోపంతో 'కొంగా! నా బిడ్డను ఏం చేశావో చెప్పు' అని అడిగింది.

అప్పుడు ఆ కొంగ 'మిత్రమా నాపైన కోపం వద్దు. నీబిడ్డను నేను ఏమీ చేయలేదు. మిత్రద్రోహం నేను చేస్తానా? నేను అలసిపోతే దాన్ని నా నేస్తమైన కొంగ ఇంకా తిప్పుతున్నది. అందువల్ల కొద్దిగా ఆలస్యంగా అది ఇక్కడకు వస్తుంది. నీవు ఆందోళన పడతావని నేను ముందుగా వచ్చి నీకు ఈ సంగతి చెప్పాను అని అంది. ఇంతలో ఈ కొంగ నేస్తమైన మరొక కొంగ ఆ కప్ప పిల్లతో పాటు సురక్షితంగా అక్కడికి చేరుకుంది. అది చూసి ఆ నక్క, అక్కడ నుండి మెల్లగా జారుకుంది. అప్పుడు ఆ పెద్ద కొంగ, 'మిత్రమా! దయచేసి ఇలాంటి ప్రమాదభరితమైన కోరికను మరొకసారి కోరవద్దు. నేను వద్దని చెప్పినా, నీ బిడ్డకు జరగరానిది ఏదైనా జరిగినా మన స్నేహానికి ఆటంకం ఏర్పడేది' అని అంది. ఆ కప్ప తన బిడ్డను చూసి, సంతోషించి, తన పొరపాటును అంగీకరించి తాను ఆందోళనతో నోరు జారినందుకు కొంగను మన్నించమంది.

**- సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,** ధర్మపురి

## బాలగేయం

### నా నేస్తం కుక్క



నాకు ఉంది
ఓ మంచి కుక్క
నేను ఎక్కడికెళ్తే
అది కూడా వస్తుంది
నామంచి స్నేహితుడు
నేను ఎక్కడ
పడుకుంటే అది
నా పక్కనే పడుకుంటుంది
నేను తినకపోతే
అదీ తిననని మారం
చేస్తుంది
నేను హోంవర్కు
చేసుకునేంతవరకు
మౌనంగా చూస్తుంది
నా పని అయిపోతే
పరుగున లేచివస్తుంది
ఇద్దరం పార్కుకు
వెళ్లి హాయిగా
ఆడుకుంటాం
నామంచి నేస్తం కుక్క.

**- రూతు**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- బి.కృత్తిక,** మణికొండ

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. కంప్యూటర్‌ను చూస్తే కంటిచూపు దెబ్బతింటుందా?**

**జవాబు: కృత్తిక!** కంప్యూటర్‌ను ఉపయోగించడం వల్ల కంటిచూపుకు ఏ విధంగానూ హాని ఏర్పడదు. ఏకబిగిన గంటల తరబడి స్క్రీన్ మీద తదేకంగా చూస్తూ పని చేయడం వలన మాత్రం కళ్లు బాగా అలసిపోవడం, కంటినొప్పి, తద్వారా తలనొప్పి వంటివి రావడం జరిగే అవకాశం ఉంది. స్క్రీన్ వైపు ట్యూబ్‌లైట్‌ను ఏర్పరచి లైటింగ్‌ను సర్దుబాటు చేయడం ద్వారా కంప్యూటర్‌తో పని చేయవచ్చు. టీవీని కనీసం పది అడుగుల దూరం నుంచి చూడాలి. కనీసం గుడ్డివెలుతురులోనైనా చూడాలి. కంటిచూపు మందగించకుండా 'ఐ ఎక్సర్‌సైజ్' చేయడం అన్ని విధాలా మంచిది.

**- ఎస్.వాసుదేవ,** హుస్నాబాద్

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. వానపడే ముందు మబ్బులు నల్లగా ఎందుకు మారతాయి?**



**జవాబు: వాసుదేవ!** వర్షం పడేముందు మబ్బులు ఎక్కువగా సూర్యకాంతిని గ్రహిస్తాయి. అందువల్ల అవి నల్లగా మారతాయి. చిన్న చిన్న నీటి బిందువులతో మబ్బులు ఏర్పడతాయి కదా. వీటి మీద కాంతి ప్రసరించినప్పుడు ఆ బిందువులు పరావర్తనం చెందుతాయి. అందువల్ల మబ్బులు తెల్లగా కనిపిస్తాయి. వాన పడేముందు నీటి బిందువుల సంఖ్య పెరుగుతుంది. అందువల్ల కాంతి అధికంగా పరావర్తనం చెందదు. ఈ దృష్ట్యా వాన పడేముందు మబ్బులు నల్లగా కనిపిస్తాయి.

# జర్మనీలో ఉన్నత విద్య



విదేశాలలో చదవడం అంటే ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. పైగా లక్షలలో ఫీజ్ ఉంటుంది. మరి ఫీజు లేకుండా చదవగలగడం నమ్మలేరు కదా! ఔను జర్మనీలో చదవడానికి ఫీజ్ వసూలు చేయరు నిజం, నమ్మండి మరి. గత సంవత్సరం లెక్కల ప్రకారం సుమారు యాభైవేల మంది మన విద్యార్థులు చదవడం కోసం జర్మనీ వెళ్లారు. ఎక్కువగా నర్సింగ్ చదువుల కోసం వెళ్లారు. పదహారు రాష్ట్రాల కలయిక ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ. ప్రపంచయుద్ధాన్ని ముందుండి నడిపింది. సాంకేతికపరంగా ఎంతో ఎదిగి ఐరోపాలోనే శక్తివంతమైన దేశంగా మారింది జర్మనీ. అందుకే మన దేశం నుండి విద్యార్థులు చదవడానికి, ఉద్యోగం కోసం జర్మనీకి





వెళ్తున్నారు. యూరోపియన్ యూనియన్లో భాగం అయిన జర్మనీ జనాభాపరంగా, ఆర్థికంగా మొదటిస్థానంలో ఉంది. ఇక్కడ కరెన్సీ యూరో. రాజధాని బెర్లిన్ పెద్ద నగరం కూడా. డ్రెస్డెన్, లీప్జిగ్, మునిచ్, హాంబర్గ్, ఫ్రాంక్ఫర్ట్, కొలోన్, డస్సెల్డోర్ఫ్, స్టాట్గార్ట్, నూరేన్బర్గ్ ఇతర ప్రధాన నగరాలు జర్మనీలో ఉన్నాయి. జర్మనీలో చదవడానికి మన విద్యార్థులు వెళ్లడానికి ముఖ్యమైన కారణం శాస్త్రసాంకేతికపరంగా విద్య నేర్పడం, విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్ నిర్ధారించే క్యూఎస్ వెలువరించే ర్యాంకింగ్లో 59వ స్థానంలో ఉంది. ట్యూడ్విగ్ మాక్స్ మిల్లన్ యూనివర్సిటీ, ఇంకా చదువు కోసం ఫీజు చెల్లించవలసిన అవసరం లేకపోవడం ప్రత్యేకత. బాచిలర్, మాస్టర్ డిగ్రీ చదవడం, డాక్టరేట్, పోస్ట్ డాక్టరొల్ రీసెర్చ్ చేయడానికి ఫీజు అవసరం లేదు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు డిఎఎడి అనబడే జర్మన్ అకడమిక్ ఎక్స్చేంజీ సర్వీస్ ద్వారా తెలుసుకోవచ్చు. జర్మనీ దేశంలో చదవడం కోసం శాస్త్రసాంకేతిక రంగంలో తమ అభివృద్ధి ప్రపంచ దేశాలకి తెలియచెప్పడానికి విద్యార్థులకి సహాయం ఫీజ్ లేకుండా విద్య నేర్పించడం జర్మనీ ఆలోచన. నర్సింగ్ చదవడం ఉద్యోగం సంపాదించడం ఒక గోల్, ప్లస్ టూ విద్యార్హతతో చేరవచ్చు. జర్మనీ భాష లో మంచి ప్రావీణ్యం ఉండాలి. మనదేశం లో ఎన్నో నగరాలలోని ఇన్స్టిట్యూట్లలో జర్మన్‌భాష నేర్పిస్తుంది. పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ చదువుకోవడానికి జర్మనీ భాష తప్పనిసరిగా వచ్చి ఉండాలి. కారణం ఇక్కడ ఇంగ్లీష్‌కి మొదటి ప్రాధాన్యత లేదు. కనుక మనం జర్మనీకి వెళ్లడానికి ముందే జర్మన్ భాష తప్పకుండా నేర్చుకుని ఉండాలి. జర్మనీలో గల టియు 9 అంటే టెక్నికల్ యూనివర్సిటీ 9 అనబడే తొమ్మిది యూనివర్సిటీల కలయిక ప్రపంచంలో పేరు పొందింది. అవి ఆర్‌డబ్ల్యుటీహెచ్ ఆచెన్ యూనివర్సిటీ, టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ బెర్లిన్, టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ బ్రున్స్‌విగ్, టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ డార్మ్స్టాడ్ట్, టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ డ్రేస్డెన్, లెయిబునీజ్ యూనివర్సిటీ హనోవర్, కారిశ్రుహే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, టెక్నికల్ యూనిర్సిటీ ఆఫ్ మునిచ్, యూనివర్సిటీ ఆఫ్ స్టుట్గార్ట్ వీటిలో చదవడానికి ప్రాధాన్యత ఇవ్వడం మంచిది. మన ఆర్థికపరమైన పరిస్థితులు గమనించి జర్మన్ భాష నేర్చుకుని జర్మనీ వెళ్తే మంచి చదువు, ఉద్యోగం తప్పనిసరిగా పొందవచ్చు. జర్మనీలో చదువు వలన శాస్త్ర సాంకేతికపరంగా ఉన్నత విలువలు గ్రహించవచ్చు. మరి ఎందుకు ఆలస్యం జర్మనీలో ఉన్నత విద్యకోసం ప్లాన్ చేసుకోండి.

**- ఈ.ఎస్.మాధవన్**

# మరింత సౌకర్యం



## మొక్కలకు సెన్సర్లు

రోజురోజుకీ ప్రపంచ జనాభా పెరిగిపోతోంది. ఆహార అవసరాలూ ఎక్కువవుతున్నాయి. జనాభా ఇలాగే పెరుగుతూపోతే 2050 కల్లా ఆహార ఉత్పత్తిని 70శాతం మేరకు పెంచాల్సి ఉంటుందని ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఒ) చెబుతోంది. దీన్ని సాధించటానికి పంటల పర్యవేక్షణ చాలా కీలకం. సంప్రదాయ మట్టి పరీక్షలు, ప్రత్యక్ష తనిఖీ వంటివి శ్రమతో కూడుకున్నవి. సమయమూ ఎక్కువే పడుతుంది. ఇలాంటి ఇబ్బందులను తగ్గించానికే ఉపగ్రహ సమాచారం, సెన్సర్లతో కూడిన డ్రోన్లు, ట్రాక్టర్ల వినియోగం పెరుగుతోంది. వీటికి తోడు ఇప్పుడు మొక్కలకు అమర్చే కొత్తతరం సెన్సర్లూ ఊపందుకుంటున్నాయి. సూక్ష్మసూదుల పరిమాణంలో ఉండే ఇవి ఉష్ణోగ్రత, తేమ, పోషకాల స్థాయిలను ఎప్పటికప్పుడు పసిగడతాయి. ఇవి అందించే సమాచారం ఆధారంగా దిగుబడిని పెంచొచ్చు. నీరు, ఎరువుల వాడకం తగ్గించొచ్చు. చీడ పీడలను ముందుగానే గుర్తించొచ్చు.

## సుస్థిర కంప్యూటరింగ్

కృత్రిమ మేధ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి టెక్నాలజీలు బాగా ఊపందుకుంటున్నాయి. వీటికి మరింత భారీ, శక్తిమంత, విస్తృత డేటా సెంటర్ల సామర్థ్యం అవసరం. ఇందుకు విద్యుత్ కూడా ఎక్కువే అవసరం. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి




అవుతున్న విద్యుత్తులో ఒక శాతం డేటా సెంటర్లకే సరిపోతుంది. డేటా వినియోగం రోజురోజుకి ఎక్కువవుతున్న నేపథ్యంలో మహాడేటా సెంటర్లూ అవసరమవుతున్నాయి. దీంతో మున్ముందు విద్యుత్తు వినియోగం పెరగటమూ ఖాయమే. అందుకే డేటా సెంటర్లలో వేడిని తగ్గించటానికి డైఎలక్ట్రిక్ లిక్విడ్ కూలింగ్ సిస్టమ్ వంటి కొత్త టెక్నాలజీలు పురుడు పోసుకుంటున్నాయి. అలాగే ఈ అధిక వేడిని భవనాలను వెచ్చగా ఉంచటానికి, నీటిని కాచటానికి, పారిశ్రామిక అవసరాలకు మళ్లించే టెక్నాలజీలూ ఊపందుకుంటున్నాయి. కృత్రిమ మేధ వ్యవస్థల సాయంతో ఇంధనాన్ని వీలైనంత ఎక్కువగా వినియోగించుకోవటం, విశ్లేషించటం మీదా దృష్టి సారిస్తున్నారు. దీంతో విద్యుత్ వినియోగం గణనీయంగా తగ్గుతుంది. ఉదాహరణకు గూగుల్ డేటా సెంటర్లలో విద్యుత్ వినియోగాన్ని 40శాతం వరకు తగ్గొచ్చు.

## జనరేటివ్ ఏఐ



జనరేటివ్ కృత్రిమ మేధ నమూనాలు చాలావేగంగా రోజువారీ జీవనంలో భాగమైపోతున్నాయి. దీనికి ఛాట్‌జీపీటీ చక్కటి ఉదాహరణ. బడులు, విశ్వవిద్యాలయాలు, కార్యాలయాల్లో విరివిగా వాడేస్తున్నారు. జనరేటివ్ కృత్రిమ మేధ నమూనాలు సంక్లిష్ట అల్గారిథమ్‌లతో డేటాలోని తీరులను వాడుకుంటాయి, గుర్తిస్తాయి. వీటిని సరిగా వాడుకుంటే ఉత్పాదకత, సృజనాత్మకత ఇనుమడిస్తాయి. ఇవి కేవలం టెక్స్ట్, చిత్రాలు, సంగీతం వంటివి సృష్టించటానికే పరిమితం కావటం లేదు. ఆయా జబ్బులకు ప్రత్యేక మందుల తయారీ, నిర్మాణ, ఇంజినీరింగ్ రంగాలకూ విస్తరిస్తోంది. ఉదాహరణకు అమెరికా అంతరిక్ష సంస్థనాసా తేలికైన అంతరిక్ష వాహన పరికరాలను సృష్టించటానికి తోడ్పడే ఏఐ వ్యవస్థలను రూపొందిస్తోంది. నాణ్యతకు తోడ్పడనున్నాయి.



కథ

# ప్రాణమిత్రుడు

కె.భాస్కరాచారి

ఉదయం ఎనిమిది గంటలు దాటింది. స్కూల్‌కు వెళ్దామనే తొందరలో వున్నాను. ఇంతలో ఇంటి ముందు కారుహారన్ వినపడింది. "ఈ సమయంలో ఎవరు?" అనుకుంటూ బయటికొచ్చాను.

ఓ పాతికేళ్ల కుర్రాడు అప్పుడే కారు దిగి, నన్ను చూసి కళ్లజోడు సర్దుకుంటూ–

"ఇది శివరాంగారి ఇల్లేనా అండి" అన్నాడు.

అతన్ని ఇంతకుముందు చూసినట్టు లేదు. చాలా దూరం నుండి వచ్చినట్టున్నాడు.

"అవును బాబూ.. నేనే ఆ శివరాంని" అన్నాను.

అతని ముఖంలో ఒక్కసారిగా ఫ్లాష్‌లా 'హమ్మయ్య' అన్న రిలీఫ్ తళుక్కున మెరిసింది. లోపలికి రావచ్చా? అన్నట్టు చూశాడు.

స్కూల్‌కి టైం అవుతుంటే ఎవరీ అనుకోని అతిథి? అనుకుంటూ లోనికి రమ్మన్నాను. మా ఆవిడ వాణి మంచినీళ్లు తెచ్చింది. సోఫాలో అతని పక్కన కూర్చొని విషయం ఏంటో చెప్పమన్నట్టు చూశాను.

"నేను మీ స్నేహితుడు మూర్తి గారి అబ్బాయినండి, నా పేరు విశాల్".

చేతులు జోడించి తనను తాను పరిచయం చేసుకున్నాడు.

నా స్నేహితులందరినీ ఓ మారు గుర్తు చేసుకున్నాను. ఊహు.. అందులో మూర్తి లేడు.

"ఏ మూర్తీ.. నాకు తెలిసి అలాంటివాళ్లు ఎవరూ లేరే?" అన్నాను.

విశాల్ తేలిగ్గా నవ్వాడు.

"నలభై ఏళ్ల కిందటి విషయం ఏం గుర్తుంటుంది చెప్పండి! మీ పక్క ఊరి నుండి వచ్చి మీతో పాటు కల్సి చదువుకున్న మీ చిన్ననాటి స్నేహితుడు గురుమూర్తి మా నాన్నగారు" అంటూ క్లూ ఇచ్చాడు.

ఈసారి నా బాల్యపు స్మృతుల్ని గుర్తు చేసుకున్నాను. అదిగో.. అప్పుడు యాదికొచ్చాడు గురుమూర్తి. మా వూరిలో ప్రైమరీ, హైస్కూల్ ఒకే దగ్గర వుండేవి. చుట్టుపక్కల గ్రామాల నుండి చాలా మంది పిల్లలు మా ఊరి బడిలో చదివేవారు. పొడుగు ముక్కు, పెద్ద నుదురు.. విశాల్‌లో అతని తండ్రి పోలికలు కూడా కన్పించాయి.

"అవును బాబూ..మీ నాన్నగారు ఇప్పుడు గుర్తుకొచ్చారు. మేం పది వరకు కల్సి చదువుకున్నాం. ఆ తర్వాత ఆయన గురించి పెద్దగా తెలియదు. మళ్లీ మేం ఎప్పుడూ కలుసుకోలేదు. హైదరాబాద్‌లో స్థిరపడినట్ల ఎవరో అంటే విన్నాను.

"అవునంకుల్.. అక్కడ మాకు చాలా బిజినెస్‌లున్నాయి. ఎందుకోగానీ వారం రోజుల నుండి మా నాన్నగారు మీ గురించి బాగా వాకబు చేస్తున్నారు. ఈ వరంగల్ సిటీలో అతికష్టం మీద మీ అడ్రస్ తెల్సుకోగలిగాను".



నాకు ఆశ్చర్యం! నలభై ఏళ్ల తర్వాత మూర్తి నా దగ్గరికి కొడుకును పంపడం ఏమిటి? ఇలా అనుకుంటూ వుండగానే మరో షాక్ న్యూస్ చెప్పాడు విశాల్.

"అంకుల్! మా నాన్నగారు ఏదో ముఖ్య విషయం మీతో మాట్లాడాలట. మీరు మరోలా అనుకోకపోతే దయచేసి నాతో పాటు రాగలరా? ప్లీజ్" అన్నాడు ప్రాధేయపడుతూ.

"నేను మా ఆవిడ ముఖాలు చూసుకున్నాం. ఉన్నపళంగా నేను హైదరాబాద్‌కు వెళ్లడం ఏమిటి? అయినా మూర్తికి నాతో ఏం పని? ఏం మాట్లాడుతాడు? ఎంత ఆలోచించినా అర్థం కాలేదు.

"విశాల్.. మీ నాన్నగారి గురించి చెప్పి చాలా ఏళ్ల తర్వాత నా మిత్రుని గురించి విన్న సంతోషం కలిగించావు. నేను పదవీ విరమణకు దగ్గర్లో వున్న టీచర్‌ని. నా ఆరోగ్యం అంతంత మాత్రమే. జర్నీ చెయ్యలేను. సారీ.. అంత దూరం రాలేను".

"ప్లీజ్ అంకుల్, మీరు అలా అనకండి. మిమ్మల్ని తప్పక వెంట తీసుకురమ్మని నాన్నగారు పదే పదే చెప్పారు" అంటూ మూర్తికి ఫోన్ కలిపి నా చేతికిచ్చాడు.

"హలో శివరాం, ఎలా వున్నావురా? నువ్వు కలిసావని బాబు చెప్పాడు. నాకు ఆనందంగా వుందిరా. ఇలా ఫోన్లో కాదు.. నా మాట విని ఇంకేం మాట్లాడక విశాల్‌తో కలిసి కార్లో వచ్చెయి" అన్నాడు ఆత్మీయంగా.

అంతా విని మా ఆవిడ "ఎవరి పరిస్థితి ఎలాంటిదో? ఆయన అంతగా అడుగుతున్నారు. పైగా మీ చిన్ననాటి మిత్రుడు. కాబట్టి వెళ్లిరండి" అంది.

కారు హైదరాబాద్ వైపు పరుగులు పెడుతోంది. నా ఆలోచనలు అంతే వేగంగా వెనక్కి పరుగెడుతున్నాయి.

స్కూల్ రోజుల్లో మూర్తి బాగానే చదివేవాడు. కానీ ఎవర్నీ లెక్కచేయకపోయేవాడు. తరచూ ఇతరులతో గొడవ పడేవాడు. ఎవరి జోలికి వెళ్లని నాతో "ఈ బడిలో నువ్వు ఒక్కడివేరా మంచోడివి" అంటూ ఎప్పుడూ నా పక్కనే కూర్చునేవాడు.

మధ్య తరగతి కుటుంబం. ఇద్దరు అక్కయ్యల తర్వాత తను పుట్టాడు.

ఇంట్లో అంతా గారాబంగా చూసేవారు. ఆశ్చర్యంగా అంత చిన్న వయసులో నాతో తరచూ ఒక మాట అనేవాడు "చదువుది ఏముందిరా! నేను మాత్రం బాగా డబ్బు సంపాదించి కోటీశ్వరుడిని అవుతాను" అని.

ఇప్పుడు నిజంగా అనుకున్నట్టే అయ్యాడు.

ఆ మాటే అన్నాను.

కారు డ్రైవ్ చేస్తూ విశాల్ "కావచ్చు అంకుల్.. నాకు మొదటి నుంచీ మా అమ్మే అన్నీను. నాన్న దగ్గరకు వెళ్లాలంటే భయం వేసేది. అమ్మ బలవంతం మీద వెళితే పెద్దగా పట్టించుకునేవారు కారు. ఎప్పుడూ బిజినెస్ మీటింగులతో అసలు ఇంటిపట్టున వుండేవారు కారు".

రెండున్నర గంటల తర్వాత పెద్ద ప్యాలెస్ లాంటి ఇంటి ముందు కారు ఆగింది. లోపల విశాలమైన గదులు ఆధునికమైన హంగులతో మెరిసిపోతున్నాయి. కుటుంబ సభ్యులతో, పనివాళ్లతో బాగా సందడిగా వుంది. తెల్లగా ఎత్తుగా వున్న ఓ అరవై ఏళ్ల వ్యక్తి నాకు ఎదురొచ్చాడు.. అతను మూర్తి.

"శివరాం! ఎన్నాళ్లయిందిరా నిన్ను చూసి. జర్నీ చేసి అలసిపోయి ఉంటావ్. పద.. భోజనం చేస్తూ మాట్లాడుకుందాం" అంటూ ఆలింగనం చేసుకున్నాడు. మూర్తిలో అదే మాటతీరు. వయసు తెచ్చిన మార్పు తప్ప తనేం మారలేదనిపించింది.

కొద్దిసేపు చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకొని నవ్వుకున్నాం. ఆ తర్వాత లంచ్. ఆకలి కంటే నన్ను పిలిపించిన కారణం ఏమై ఉంటుందని ఆలోచిస్తోంది నా మనసు. మూర్తి తన భార్యనీ లక్ష్మి అంటూ పరిచయం చేశాడు. లక్షణంగా వుందావిడ. ఆమె మా ఇద్దరికీ వడ్డిస్తూ–

"ఈ మధ్య రోజూ మీ గురించే చెపుతున్నారు. మీరు రావడం నిజంగా ఆయనకు చాలా సంతోషంగా వుంది" అంటూ మాకు కావాల్సినవి అక్కడ పెట్టేసి వెళ్లిపోయింది.

భోజనం కలుపుతూ మూర్తి "చూశావురా... ఈ ఇల్లు, కుటుంబం, స్టేటస్.. జీవితంలో అన్నీ సాధించాను" అన్నాడు గంభీరంగా.

"అవునవును.. నువ్వు కోరుకున్న జీవితం. అంతా హ్యాపీ" అన్నాను తింటూ.

"కానీ నా మనసు అలా లేదురా. లోపల అగ్నిగుండాలు రగులుతున్నాయి. పాత జ్ఞాపకాలు సెగలు నన్ను నిలువునా కాల్చేస్తున్నాయి" అన్నాడు బాధగా.

అతని మాటలకు ముద్ద గొంతులో ఆగి స్వరం తప్పింది నాకు. వెంటనే మంచినీళ్లు అందించాడు.

"పైకి నువ్వు బాగానే వున్నావు కదా! ఎవరు నిన్ను అంతగా బాధ పెట్టేది?" విస్తుపోతూ అన్నాను తినడం ఆపి.

"నా అంతరాత్మ.. అవును. నువ్వు నమ్మితీరాలి.. ఇది నిజం".

నేను నిర్ఘాంతపోయి మూర్తిని చూస్తుండిపోయాను. "దయచేసి నన్ను పూర్తిగా చెప్పనివ్వరా.. నా గురించి చాలా విషయాలు నీకు తెలియవు. అవి డిగ్రీ చదివే రోజులు. డబ్బు సంపాదించాలనే నా కల గురించి విని మా ఊరి శేఖరన్న అర్జంట్‌గా లక్ష రూపాయలు తీసుకొని నాతో హైదరాబాద్ వచ్చెయ్యమన్నాడు. అక్కడ తను 'రెడ్డి ఇన్ఫ్రో'లో ప్లాట్ల బిజినెస్ చేస్తాడు. అప్పటికప్పుడు లక్ష రూపాయలు ఎక్కడి నుండి తేగలను? కానీ అదే సమయంలో అక్క పెళ్లి కోసం నాన్న లక్ష రూపాయలు అప్పు తెచ్చి ఇంట్లో పెట్టాడు. తెల్లవారితే పెళ్లి. ఆ డబ్బులు తీసుకుంటే!? ఆలోచించాను...

అక్క పెళ్లి ఆగిపోతుంది జాగ్రత్త.. అంటూ హెచ్చరించింది నా అంతరాత్మ. కానీ... కానీ.. ఈ నగదు, ఈ అవకాశం వదులుకుంటే ఇక ఎప్పటికీ నేను అనుకున్నది దక్కదు. తర్జన భర్జన పడ్డాను. "డబ్బే వుంటే అక్కకు ఇంతకంటే గొప్ప సంబంధం తేగలను" అనుకుంటూ నా అంతరాత్మ నోరు నొక్కేశాను.

"శివరాం! ఎన్నాళ్లయిందిరా నిన్ను చూసి. జర్నీ చేసి అలసిపోయి ఉంటావ్. పద.. భోజనం చేస్తూ మాట్లాడుకుందాం" అంటూ ఆలింగనం చేసుకున్నాడు. మూర్తిలో అదే మాటతీరు. వయసు తెచ్చిన మార్పు తప్ప తనేం మారలేదనిపించింది.

ఆ లక్ష్యంతో ఎవరికీ తెలియకుండా రాత్రికి రాత్రి వెళ్లిపోయాను. హైదరాబాద్ శివారులో రెండు ప్లాట్లు కొని అమ్మితే నెల తిరక్కుండానే డబుల్ ప్రాఫిట్ వచ్చింది. నా సంతోషానికి అవధులు లేవు. ఇక వెనక్కి తిరిగి చూసుకోలేదు. భూములు కొనుడు, అమ్ముడు చేస్తూ కోట్లకు పడగలెత్తాను. నా తెలివితేటలు, ముందుచూపుకు తిరుగు లేకుండా పోయింది. కానీ అక్క పెళ్లి ఆగిపోవడంతో నాన్న గుండె ఆగింది. ఆనందంతో ఇంటికి వెళ్దామనుకున్న నాకు నాన్న మరణం తీరని ఆవేదన మిగిల్చింది. ఇంటికి, ఊరికి ముఖం చూపించలేకపోయాను. ఇప్పుడు.. ఈ మలి వయసులో ఆ రోజు ఆయన చావుకు నేనే కారణం అన్న అపరాధ భావం నిత్యం ఆరని మంటలా నన్ను దహించి వేస్తోంది. చిన్ననాటి నుండి నన్ను అర్థం చేసుకున్న వ్యక్తివి. ఇవి నీతో తప్ప ఎవరితోనూ చెప్పుకోలేను, పంచుకోలేను. అందుకే నిన్ను పిలిపించాను.

గంటలు క్షణాల్లా మారాయి. తన జీవితాన్ని తెరిచిన పుస్తకంలా నా ముందు పరిచాడు మూర్తి. అంతా సావధానంగా విన్నాను. ఇప్పుడు తనకు కావలసింది కూడా ఇదే 'వినడం'.

"మూర్తీ! తెలిసో తెలియకో అందరూ తప్పులు చేస్తారు. కానీ వాటిని సరిచేసుకొని జీవితాన్ని నరకప్రాయం కాకుండా చూసుకోవాలి. మీ అమ్మ గారిని, తోబుట్టువులను తిరిగి ఆదరించు. వాళ్లను మనసారా క్షమాపణలు కోరుకో. దాంతో నీకు కొంత ఉపశమనం కలిగి నీ అంతరాత్మ శాంతిస్తుంది".

ఆ పని చేశాడట మూర్తి. మొదట్లో అమ్మకు అక్కల పెళ్లిళ్ల కోసం డబ్బులు పంపితే తీసుకోలేదు. నాకు కొడుకే లేడని ఏడ్చింది. కానీ ఏడాది క్రితం బతిమిలాడి అమ్మను, ఇద్దరు తోబుట్టువులను, బావలను అందరినీ నా దగ్గరికి తెచ్చుకున్నాను. వాళ్ల పిల్లలకు ఉద్యోగాలు ఇప్పించాను. ఇప్పుడు వారంతా సంతోషంగా కనపడుతున్నారు. కానీ నాతో అంటీ ముట్టనట్టే వుంటారు. దగ్గరికి వచ్చి ప్రేమగా మాట్లాడరు. ఇది నాకెంతో వేదనను కలిగిస్తుంది. నాకు ఒకటి బాగా అర్థమైందిరా. మన శరీరంలో బలం వున్నప్పుడు నా అంతటివాడు లేడు అంటూ విర్రవీగి అంతరాత్మ వద్దన్న పనులే చేసుకుంటూ పోతాం. కానీ ఒంట్లో శక్తి ఉడిగినపుడు ముసలితనం వచ్చినప్పుడు అంతరాత్మ మన తప్పుల్ని గుర్తు చేస్తే మనం కుమిలిపోయేలా చేస్తుంది. అందుకే ఎవరికి వారు తమ మనస్సాక్షి ప్రకారం నడుచుకోవాలి. నా జీవితంలో నేను నేర్చుకున్న అతి పెద్ద గుణపాఠం ఇదే" అన్నాడు దీర్ఘంగా నిట్టూరుస్తూ.

హృదయ లోతుల్లో నుంచి వస్తున్న ఆ మాటల్లోని వేదన అర్థమైంది. ఆ రాత్రంతా మాట్లాడుకుంటూ ఉండిపోయాం. మరుసటి రోజు వెళ్లడానికి రెడీ అయ్యాను. నాకు, మా ఆవిడకు వద్దంటున్నా కొత్త బట్టలు పెట్టారు. తన కారులో నన్ను సాగనంపుతూ నా చేతిలో చెయ్యి వేసి "మళ్లీ నిన్ను కలుస్తానో లేదోరా" అన్నాడు మూర్తి కన్నీళ్లతో.

మిత్రుని మాటలకు నా కళ్లు కూడా తడి అయ్యాయి. ఎక్కువగా ఆలోచించకుండా ప్రశాంతంగా ఉండమన్నాను.

ఇది జరిగిన వారం రోజులకు ఓ రాత్రి పది తర్వాత మూర్తి నుండి ఫోన్ వచ్చింది.

"శివరాం! ఈ అపరాధ భారం నేను మోయలేను. ఈ వాతావరణంలో బతకలేను. రక్త సంబంధీకులే కాదు నా భార్య, కొడుకు కూడా నన్ను అనుమానంగానే చూస్తున్నారని అనిపిస్తోంది. మొదటి నుంచి వాళ్ల దగ్గర ఈ విషయం దాచుకుంటూ వచ్చాను. ఇక నా వల్ల కాదురా, నేను చనిపోతాను. అప్పుడు ఈ అంతరాత్మ పీడ కూడా విరుగడైపోతుంది".

మూర్తి గొంతులో వణుకు, కంగారు ఏడుపు.. నేను టెన్షన్ పడ్డాను. వద్దు.. వద్దని గట్టిగా చెప్పాను.

అటువైపు కాసేపు నిశ్శబ్దం. తర్వాత ఫోన్ కట్. నేను చేష్టలుడిగిపోయాను. ఇప్పుడేం చేయాలి? మనిషికి అన్నీ వుండి ఏం లాభం? మనశ్శాంతి లేకుంటే?

మూర్తి చాలా ఎమోషనల్‌గా వున్నాడు. తను ఎవరికి అవసరం లేదన్న అభిప్రాయానికి వచ్చాడు. ఇలాంటివాళ్లు ఆత్మహత్యా ప్రయత్నాలు చేస్తారు. మళ్లీ ఫోన్ చేశాను. స్విచ్చాఫ్.... స్విచ్చాఫ్. ఇక ఆ రాత్రి నాకు కాళ రాత్రే అయింది. టైం చూస్తే పన్నెండు దాటింది. క్షణ క్షణానికీ నాలో టెన్షన్ పెరిగిపోతోంది. ఇలా బాధపడే బదులు హైదరాబాద్‌కు వెళ్లమంది నా అంతరాత్మ.

ఇక ఉండబట్టలేక మా ఆవిడకు చెప్పి హైదరాబాద్ బస్ ఎక్కేశాను.

తెల తెలవారుతుండగా మూర్తి ఇంటికి వచ్చేశాను. నా అనుమానం నిజం చేస్తూ ఇంటి ముందు పెద్ద టెంటు. నా మనసు కీడు శంకించింది. అయితే మూర్తి అనుకున్నంత పనీ చేసాడా? నా కాళ్లు, చేతులు వణుకున్నాయి. అడుగులు భారంగా పడుతున్నాయి. ఇల్లు ఆవరణంతా సైలెంట్‌గా వుంది. అంతా హాస్పిటల్ దగ్గర ఉన్నారేమో! పెద్ద ఇనుప గేట్ దాటి లోపల అడుగు పెట్టాను. ఇంట్లోకి నాకు ఎవరో ఎదురొస్తున్నారు. ఎవరూ? విశాల్! అవును తనే! నాలో అయోమయం!

విశాల్ నన్ను చూసి సంభ్రమాశ్చర్యాలతో "సరిగ్గా టైంకొచ్చారు అంకుల్, లోపలకు వెళ్లండి. వెళ్లి మీ ఫ్రెండ్ ఏం చేస్తున్నాడో చూడండి" అన్నాడు హడావిడిగా బైటికి వెళ్తూ.

ఇంట్లోని పెద్ద హాల్‌లో అడుగు పెట్టి అక్కడి దృశ్యం చూసి నా కళ్లు తేలేశాను. లోపల పెద్ద ఫంక్షన్ జరుగుతోంది. పొద్దున్నే అందరూ చక్కగా ముస్తాబై ఆ వేడుకలో వున్నారు. మూర్తి మంచి సూట్ ధరించి తన భార్యతో కలిసి అందరి చప్పట్ల మధ్య తల్లీ, తోబుట్టువులను కూర్చుండబెట్టి కాళ్లు కడుగుతున్నాడు.

విశాల్ నన్ను చూసి సంభ్రమాశ్చర్యాలతో "సరిగ్గా టైంకొచ్చారు అంకుల్, లోపలకు వెళ్లండి. వెళ్లి మీ ఫ్రెండ్ ఏం చేస్తున్నాడో చూడండి" అన్నాడు, హడావిడిగా బైటికి వెళ్తూ.

కెమెరాలు క్లిక్‌మంటున్నాయి. నట్టింట్లో ఆనందపు నవ్వులు విరబూస్తున్నాయి. అంత సందడిలోనూ మూర్తి హడావిడిగా నా దగ్గరికి వచ్చి ఆప్యాయంగా దగ్గరకు తీసుకొని "నా కోసం వచ్చావురా. నేను చనిపోతానని భయపడ్డావా? నిజంగా నిన్న రాత్రి టెర్రస్ మీద నుండి దూకాలనుకొన్నాను. కానీ చివరిసారి నీ నుండి వచ్చిన మెసేజ్ నన్ను ఆపిందిరా. ఆ మెసేజ్‌లో "నువ్వు చనిపోతే నీ ఆత్మఘోష నీతో పాటే పోతుంది. కానీ ఎందుకు చనిపోయావో నీ స్నేహితులకు, బంధువులకు, చివరకు నీ భార్య, కొడుక్కి కూడా తెలియదు. వాళ్లకు మాత్రం నువ్వు దోషిగానే మిగిలిపోతావ్. అప్పుడు చనిపోయి ఏం లాభం? ఈ రోజు నుండి నీ శేష జీవితం మొత్తం నీ అంతరాత్మ చెప్పినట్టు నడుచుకో. గుర్తు పెట్టుకో.. అసలు జీవితమే శాశ్వతం కానప్పుడు ఈ బాధ, దుఃఖం శాశ్వతంగా నీతో ఎలా వుంటాయనుకున్నావ్. ఈ సమయం కూడా 'గడిచిపోతుంది'. ఇది చదివాక నాది పిచ్చి పని అని అర్థం అయ్యింది. ఒక ఐడియా జీవితాన్ని మార్చుతుంది. కానీ నీ ఒక్క సందేశం నా జీవితాన్ని నిలబెట్టింది. ప్రాణాలు కాపాడి నువ్వు నిజంగానే నా 'ప్రాణమిత్రుడివి' అయిపోయావు" అన్నాడు ఆనందంగా.

నేనున్నాను.

"నిజానికి ఎవరి అంతరాత్మ వారికి ప్రాణమిత్రుడు. దాని మాట వింటే బాగుపడతాం. లేదంటే ఇదిగో ఇలా బాధలు పడతాం. ఆ రోజు నీ అంతరాత్మ మాట విని వుంటే ఆర్థికంగా ఈ స్థితిలో వుండేవాడివి కాకపోవచ్చు. కానీ మీ నాన్న నీతో వుండేవాడు. ఆయన ప్రాణాలు నిలిచి వుండేవి.

ప్రాణం కంటే డబ్బు గొప్పదని ఎవరైనా చెప్పగలరా? ఎవరికైనా తెలివితేటలు, పట్టుదల వుంటే ధనవంతులు కావడం ఈ రోజుల్లో పెద్ద కష్టం కాదు. కానీ ప్రాణాన్ని మళ్లీ తీసుకురాలేం. నేడు చాలా మంది తమ అంతరాత్మలను మరిచి, ఒట్టి మరమనుషులుగా బతుకుతున్నారు. అత్తను సరిగా చూడని కోడలు, తల్లిదండ్రులను సరిగా చూడని కొడుకులు తిరిగి వృద్ధాప్యంలో వాళ్లు అదే ఫలితం అనుభవిస్తున్నారు. ఇదేం తెలివి? ఎందుకు పుట్టామో, ఎలా బతకాలో తెలియకుండానే సగానికంటే ఎక్కువ మంది ఈ భూమిని వదిలి వెళ్లిపోతున్నారు. నేటి సమాజానికి ఇదో పెను విషాదం.

"మూర్తీ, చాలా మందిలా కాక నువ్వు మళ్లీ అంతరాత్మ వైపు నడిచావు. నిజానికి అది నీడలా ఎప్పుడూ మన వెన్నంటే వుంటుంది. మనం నోరు నొక్కేశామని భ్రమపడతాం. మన మీద వెలుగు పడితే మన నీడను చూడగలం. అలాగే మనలో జ్ఞానం వుంటే అంతరాత్మ వెంట నడవగలం" అన్నాను.

"నా మాటలు విని చాలా థాంక్స్‌రా" అంటూ నా చేతుల్ని తన రెండు కళ్లకు అద్దుకొని "పద.. అమ్మ, అక్కయ్యలను పరిచయం చేస్తాను" అన్నాడు మూర్తి సంతోషంగా.

# జ్ఞానికి జైలైనా, రాజుగారి భవనమైనా ఒక్కటే!

ఓ గురువు ఉండేవారు. ఆయన జెన్ గురువు. ఆయనకు ఓ అలవాటు ఉండేది.

అదేంటంటే అప్పుడప్పుడు దొంగతనాలు చేస్తుంటారు. అంతే.. ఆ దొంగతనాలు కూడా పెద్దవేమీ కావు. ఆయన చేసే దొంగతనాలన్నీ చిన్న చిన్నవే. ఇతరులకు చెందిన చిన్న చిన్న వస్తువులను దొంగిలించడం, పట్టుబడటం, జైలుకి వెళ్లడం, జైలు నుంచి విడుదల అయ్యాక మళ్లీ దొంగతనానికి పాల్పడటం, మళ్లీ పట్టుబడటం, శిక్ష అనుభవించడం.. ఇదే ఆయన అలవాటు.

ఆయన వైఖరి శిష్యులకు ఓ పొడుపు కథలా ఉండేది. మన గురువుగారు ఓ జ్ఞాని. కానీ ఆయన ఎందుకు ఇలా దొంగతనాలు చేస్తున్నారో అర్థం కావడం లేదు. ఒక్కొక్కప్పుడు వారికి సిగ్గుగా కూడా ఉండేది ఆయనను తమ గురువుగారు అని చెప్పుకోవడానికి. కానీ అది బయటకు తెలియనిచ్చేవారు కాదు. కానీ ఆయనను చూస్తే ఆశ్చర్యంగా ఉండేది. ఎందుకలా చేయడం? శిక్ష అనుభవించడం? ఆయన హోదాకు ఇది ఏమన్నా బాగుందా? అని అనుకున్నారు.

చెవులు కొరుక్కునేవారు. తమలో తాము నలిగిపోవడం ఎందుకు అనుకున్నారేమో? ఆయననే అడిగి తెలుసుకోవాలనిపించి అడిగేశారు కూడా.

"ఏమిటి గురువుగారూ, ఎందుకిలా చేస్తున్నారు? చెప్పులు కూడా దొంగిలించాలా? మీకు కావాలని చెప్తే మేమే మీకు కొనిస్తాం కదా. ఒకటేమిటి? బోలెడన్ని చెప్పులు కొనిస్తాం" అన్నారు శిష్యులు.

వారి మాటలకు జవాబుగా ఆయన ఓ చిన్న నవ్వు నవ్వారు. అంతేతప్ప ఏమీ చెప్పలేదు. ఆ తర్వాత కూడా ఆయన తన అలవాటుని మానుకోలేదు.

దొంగతనం చేయడం, పట్టుబడటం, జైలుకెళ్లడం, విడుదల కావడం.. నిత్యమూ జరుగుతోంది. శిష్యులు అడిగితే నవ్వుతూ వెళ్లిపోయేవారు తప్ప ఏమీ చెప్పేవారు కాదు. ఇలా ఆయన కాలం సాగిపోయింది.

చివరికి ఓ రోజు ఆయన మరణశయ్యపై ఉన్నారు. గురువు గారి పక్కన శిష్యులందరూ నిల్చున్నారు.

అప్పుడు "మన గురువుగారు ఇప్పటికైనా నిజం చెప్తారా?" అని అనుకున్నారు శిష్యులు. కానీ ఆయన ఎంతసేపటికీ చెప్పకపోవడంతో శిష్యులే ఆయనను అడిగేశారు.

"స్వామీ, ఇప్పుడైనా చెప్పండి. మీరు తరచూ దొంగతనాలు చేస్తూ జైలుకెందుకు వెళ్లారు? దానికి కారణమేమిటీ? ఇందులో ఉన్న రహస్యమేమిటీ?" అని అడిగారు.

అప్పుడాయన "ఇందులో పెద్ద రహస్యమేమీ లేదు. ఇది సాధారణ విషయమే అది" అన్నారు.



ఆ మాటతో శిష్యులకు మరింత ఆశ్చర్యం. ఏమిటీ దొంగతనం చేయడం సాధారణ విషయమా? అని అయోమయంలో పడ్డారు.

అప్పుడు ఆయన "మరేమీ లేదు. నేను తరచూ జైలుకి వెళ్లాలని ఆశించాను. అందుకే దొంగతనాలు చేశాను. లోపల వున్నవారిని సమావేశపరిచి వారితో మాట్లాడుతుండేవాడిని. వారికి మంచి-చెడులు చెప్పాలనుకున్నాను. ఏది చెయ్యాలి, ఏది చెయ్యకూడదు.. అనే విషయాలను వివరంగా చెప్తూ వచ్చాను. అందుకే చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ కావాలనే పట్టుబడి జైలుకి వెళ్లి నేననుకున్న ఉపదేశాలు చేస్తూ వచ్చాను. జైలు నుంచి విడుదలైన వారిలో చాలా మంది మారిపోయారు. దొంగతనాలు చెయ్యడం మానేశారు.

నేను చేసే దొంగతనాలకు న్యాయమూర్తి కనీసం ఆరు నెలల కారాగార శిక్ష విధించేవారు. ఆయన చాలా మంచివారు. నాకు మంచి అవకాశమే ఇచ్చారు. ఈ ఆరు నెలల శిక్షా కాలంలో నేను నా మాటలతో ఎందరినో మార్చగలిగాను. ఇది నాకెంతో సంతోషాన్ని ఇచ్చింది. మీకైతే ఏది మంచో, ఏది చెడో, ఏది చెయ్యాలో, ఏది చెయ్యకూడదో తెలుసు. కానీ దొంగతనం చేసేవారికి అది తెలిసేది కాదు. కనుకే అటువంటివారికే నా ఉపదేశాలు అవసరం. అందుకే ఆ పని చేశాను" అన్నారు గురువుగారు.

దాంతో శిష్యులు ఆశ్చర్యపోయి ఆయనను చూశారు.

నిజమైన జ్ఞానికి జైలైనా, రాజభవనమైనా ఒక్కటే అని ఆ జెన్ గురువు తన ప్రవర్తనాసరళితో నిరూపించారు.

సరే.. అదలా ఉండనిచ్చి ఓ విషయానికి వస్తాను.

నాకొక తెలిసిన మనిషి ఉన్నాడు. అతను కాస్తంత భిన్నమైనవాడు. తరచూ దొంగతనాలు చేస్తాడు, పట్టుబడతాడు. జైలుకు వెళ్తాడు. శిక్ష అనుభవిస్తాడు. విడుదల అవుతాడు.

"ఎందుకు ఇలా చేస్తున్నావని?" అడిగాను.

అప్పుడతను "జైలనేది నాకు ఓ మావగారి ఇల్లులాగా" అన్నాడు.

"నిజంగానే అలా చెప్తున్నావా?" అని అడిగితే– "అవునండీ.. మా మామగారు జీవితకాల శిక్ష పడి జైల్లోనే ఉంటున్నారు. ఆయనను కలుసుకోవడానికి ఇంతకన్నా మరొక మార్గం లేదు" అని నవ్వాడు.

నాకు నవ్వు రాలేదు సరికదా ఎందుకిలా అన్నాడా? అని ఆలోచించాను. జవాబేమీ దొరకలేదు. ఇక్కడితో ఈ విషయం కంచికి.. నేను ఇంటికి.

**- సాత్యకీ రేణుక**

# సాహిత్యంలో సినీ గేయాల ప్రాశస్త్యం

తెలుగు చలనచిత్ర రంగంలో టాకీయుగం ప్రారంభమైనప్పటి నుండి సుప్రసిద్ధ తెలుగు రచయితలు, సినిమాలకు రచనలు చేస్తూ జన సామాన్యంలో వ్యవహారిక భాషగా, తెలుగును సుస్థిరం చేసారు. గ్రాంథిక స్థాయి నుంచి పద్య, గద్య, వచన, వ్యాసం, కథ, నవల, నాటకం ఇలా.. వివిధ ప్రక్రియలలో ఆధునిక భాష పత్రికా భాషగా ప్రాచుర్యం పొంది, క్రమేపీ కథ, సంభాషణలు, పాటలు, వినోద, విజ్ఞాన ప్రధానంగా చనలచిత్ర రంగంలో ప్రవేశించింది.

తాపీ ధర్మారావు, బలిజేపల్లి లక్ష్మీకాంత కవి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, మల్లాది రామకృష్ణ శాస్త్రి, శ్రీశ్రీ, ఆత్రేయ, ఆరుద్ర, పింగళి నాగేంద్రరావు, దాశరథి, సి.నారాయణరెడ్డి వంటి తొలితరం సుప్రసిద్ధ రచయితలు, సాహితీవేత్తలు వ్యాపార సినీ రంగంలో అనేక పరిమితులు తామే విధించుకొని ఉత్తమ సాహిత్యాన్ని సృష్టించారు. తాపీ ధర్మారావు, త్రిపురనేని గోపీచంద్ వంటి మేధావులు పత్రికా రచయితలుగా, కథకులుగా ఎందరో దక్షిణ భారతదేశంలో చలనచిత్ర పరిశ్రమ క్రమేపీ స్థిరపడే నాటి రోజులలో ప్రసిద్ధ చలనచిత్ర నిర్మాత, దర్శకుడు గూడవల్లి రామబ్రహ్మం తదితరుల పిలుపు మేరకు మద్రాస్ చేరుకొన్నారు.




1931లో తెలుగులో టాకీల యుగం ప్రారంభమైంది. తొలి తరం తెలుగు చిత్రాలలో తాపీ ధర్మారావు, గోపీచంద్‌ల కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణల కారణంగా 'రైతుబిడ్డ' విజయవంతమైంది. సాహితీవేత్తలుగా ప్రతిభావంతులైనప్పటికీ, అప్పటికి అంతగా పేరు ప్రఖ్యాతులు లేని సముద్రాల, సదాశివ బ్రహ్మం, తోలేటి, సముద్రాల జూనియర్, వేటూరి సుందరరామమూర్తి, సంభాషణలు, పాటలు, కథలు వంటి ప్రక్రియలతో తెలుగు చలనచిత్ర రంగాన్ని క్రమేపీ సంపన్నవంతం చేసారు. అజ్ఞాత రచయితలు ఎందరో ఉన్నారు.

అన్ని రంగాలలో పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రారంభమైన స్వాతంత్ర్యానంతర దశకాలలో సినిమా కూడా వ్యాపారంగా విలసిల్లింది. సినీ నిర్మాతల చిత్తవృత్తి, మాయామర్మాలు, చలనచిత్రాలలో కృత్రిమ భావజాలం, వికృత ధోరణులు, సహజత్వం కోల్పోతున్న నాటకీయతను అభ్యుదయ సాహితీవేత్తలు కొందరు జీర్ణించుకోలేకపోయారు. విశ్వనాథ, చలం, కొడవటిగంటి, గోపీచంద్, రంగనాయకమ్మ లాంటి మేటి సాహితీవేత్తలు ఎందరో తమ తత్వానికి సరిపడక మద్రాస్ చిత్ర పరిశ్రమకు దూరం అయ్యారు.

అంతకుముందు 1930–1940లలోను స్వాతంత్ర్యానంతరం, నాటి సమాజంలోని రచయితలు, కళాకారులు, మేధావులు, సమరయోధులు సహజంగా అభ్యుదయ ఆశయ భావోత్తేజంతో ఆర్థిక ఇబ్బందులు కూడా ఎదుర్కోవలసి వచ్చింది. మద్రాసు నగరం ఎందరో పత్రికా రచయితలకు, సినీ పాటలు, మాటలు, కథా రచయితలకు జీవికగా వేదిక అయింది. తెలుగు చలనచిత్ర రంగంలో సన్నివేశ, సందర్భాలకు అనుగుణంగా సాహితీ విలువల, అభ్యుదయ భావదీప్తితో, ప్రజాకవులుగా నాటి పాటలకు శాశ్వత విలువలతో ఉన్నత శిఖరం అధిష్ఠింపచేసారు.

1948లో 'నీర్ ఔర్ నందా' అనే హిందీ చిత్రాన్ని తెలుగులోకి డబ్ చేయటంలో రచయితగా సినీ రంగ ప్రవేశం చేసిన శ్రీశ్రీ మరణించేవరకూ సినీ రచయితగా లబ్ధ ప్రతిష్ఠత సాధించారు. శ్రీశ్రీ సినీ రంగ ప్రవేశానికి ముందే 'కాలచక్రం' అనే సినిమాలో మరో ప్రపంచ గేయం వెండితెరకెక్కింది. శ్రీశ్రీ పాటలు, సంచలన రచయిత చలం సంభాషణలు రాయవలసిన 'గాంధీనగర్' చిత్రం అసలు నిర్మాణానికి నోచుకోలేదు.

సినిమా ఎన్నో కళల నైపుణ్యాల సమాహారం. సినిమా సృజనలో పాటలు, ఒక అలంకారంగా, ఆకర్షణగా ఉపకరిస్తున్నాయి. ప్రణయ, ప్రళయ, వినోద, విషాద గీతాలు సినిమా పాటకు, సాహిత్య గౌరవాన్ని సంతరింప చేయటంలో తెలుగు రచయితల ప్రతిభ స్పష్టమవుతోంది. ఒక్క శ్రీశ్రీ 'మహాప్రస్థానం'లోని కవితలే పాతిక పైగా చలనచిత్రాలలో పాటలుగా, మాటలుగా చలనచిత్ర మకుటాలుగా చోటు చేసుకొన్నాయి. తెలుగు సినిమా చరిత్రలో జాతీయ బహుమతి అందుకొన్న తొలిపాట శ్రీశ్రీ రచన 'తెలుగువీర లేవరా', 'జననీ జన్మభూమిశ్చ', 'పుణ్యభూమి నా దేశం', 'పాడవోయి భారతీయుడా' ఇలా... ఎన్నో ఉన్నాయి.

సాధారణంగా సినిమా పాటలను ప్రజలు తలచుకొనేది కొద్ది కాలమే. కానీ కాలానికి ఎదురీది దశాబ్దాల తరబడి ప్రజలు తలచుకొనే ఎన్నో పాటలు తెలుగు సినీ సాహిత్యంలో చోటు చేసుకొన్నాయి.

ఇక పౌరాణిక చిత్రాల నుండి భక్తి పారవశ్యం కలిగించే సినీ గేయాలు కోకొల్లలు. తెలుగువారి జీవితాలలో సుఖదుఃఖాలు, జీవిత సత్యాలను వివరించే వైరాగ్య గీతాలు, సమాజ దుష్టత్వాన్ని నిలదీసి ప్రశ్నించే పాటలు, హాస్య గీతాలు, జానపదాలు ఎన్నో ఎన్నెన్నో అరిస్తున్నాయి.

"పొలంగట్టు దుమ్ములోన పోట్లగిత్త దూకినట్టు" 2023 ప్రస్తుతంలో సినీ రచయిత చంద్రబోస్, తెలుగు జానపద సాహితీ పరిమళాన్ని 'నాటు–నాటు' పాట ద్వారా ఆస్కార్ అవార్డ్ పురస్కారంతో విశ్వవేదికపై ప్రతిష్ఠింపచేసారు. అత్యాధునాతన 21వ శతాబ్దపు సాంకేతిక విజ్ఞానం వైపు పరుగులు తీస్తున్న తెలుగు సినీ సాహిత్యంలోని పాట ఏ బాటలో, యవనికపై సాక్షాత్కరిస్తుందో కాలమే నిర్ణయిస్తుంది.

**- జయసూర్య**

# ఆ రోజులే వేరు..

జీవితాన్ని కొందరు చాలా సీరియస్‌గా తీసుకుంటారు. కొందరు అసలు జీవితాన్ని ఎలా తీసుకోవాలో ఆలోచించకూడదంటారు. కొందరు ఆలోచన వద్దు, ముందర జీవించు అంటారు. ఒక పద్ధతి చాలా నచ్చుతుంది. నాకు అన్నింటినీ వ్యంగ్యంగా చిత్రీకరిస్తూ కూడా ప్రతి విషయాన్నీ చక్కగా నేర్పుతోనే వ్యవహారించటం ఒక కళ.

సుబ్బారావు అటువంటి కళాకారుడే.

పొరపాటుగా ఆ మధ్య "అమ్మాయికి సంబంధాలు చూస్తున్నావా?" అన్నాను. అలవాటుగా అడిగానే కానీ మరో ఉద్దేశం ఏమీ లేదు. తిరుగు టపాలో ఏమొస్తుందో తెలుసు. "రెండు మాటలు వాడావు" అన్నాడు. ఒకటి అమ్మాయి, రెండు సంబంధం. మూడోది చూస్తున్నావా?" అనేసావు.

"అన్నాను"

"అలాక్కాదు.. సంబంధం అనే పదానికి అర్థం మారిపోయింది. పరిచయాలు, తెలిసినవారు, సంబంధీకులు.. వీళ్లంతా షోకేస్ లోపల చీరెలు కట్టేసి ఉంచిన బొమ్మల్లాంటివారు".

"అంటే?"

"ఆ బొమ్మలు అక్కడ ఆ చీరెలు లేదా అటువంటివి ఉంటాయి అని చెప్పేందుకు. బొమ్మలు అమ్ముతారని కాదు".

"ఇది దారుణం.. అలా ఎవరూ అనుకోరు. నేను ఎప్పుడూ అనుకోలేదు".

"ఒకానొక కాలంలో తెలిసినవారు, మంచి కుటుంబం, మంచి సంప్రదాయం, మంచి... మంచినీళ్లు ఇలా మాటలు వినిపించేవి"

"నిజమే.."

"ఇప్పుడు హోటల్లో మంచినీళ్ల గ్లాసు పెట్టరు"

"బాటిల్ పెట్టి, దాని ధర బిల్లులో వేసి జిఎస్‌టి రాష్ట్రానికీ, కేంద్రానికీ పంచువాడు".

"కరెక్ట్"

"అవి మానవ సంబంధాలు. అంతా దూకుడే. రిలే రేస్. ఒ కర్ర పట్టుకుని పరుగులు తీయాలి. చివరగా అందుకున్నవాడు దాటేస్తాడు. ఇలా అందించిన వారంతా మటుమాయం!"

"మ్యారేజ్ బ్యూరోలు"

"వాళ్ల వ్యవహారం ఇంకా గొప్పగా ఉంటుంది" "అదొకటా?"

"అవును మరి.. ఒకాయనకి అయిదు వేలు కట్టించుకుని ఎప్పుడు చూసినా ఒక అందమైన అమ్మాయి ఫొటో మొబైల్‌లో పంపిస్తున్నారు ఒక బ్యూరోవాళ్లు".

"అదేంటి?

అదే మరి. నాకూ చూపించాడాయన. "బావుందా?" అన్నాడు.

"ఎక్కడో చూసినట్లుంది" అన్నాను.

ఆయన సంతోషించాడు.

నాకు తెలుసా? నా ఊరువాడా?... ఇలా ఏవేవో అడిగాడు. "మంచిదే కదా!"

"మంచిదే. అది కాదు. మరో మిత్రుడు కూడా ఆ ఫొటో నాకు చూపించాడు. ఆ ఫొటో చూస్తూ రెండేండ్లు గడిపాడు. తెగ కాల్స్ వచ్చేవి. టెక్సాస్‌లో పని చేస్తోందిట. అమ్మా, ఆయన కడపలో ఉంటూ గడప దాటరన్నారు అటు పక్క ఫోన్లో. ఇదుగో మాట్లాడతాం, అదుగో మాట్లాడతాం అన్నారు. ఇంతలో మరో పదివేలు ఖర్చు అయిపోయింది అంతా బోగస్ సార్!"

"అన్యాయం!"

"అది చాలా చిన్నమాట. మరో అరాచకం జరుగుతోంది"

"చెప్పండి"

"పాము, ముంగీస"

"ఇదేంటి?"

"జాతకాలు. ఒక్కడికీ సరిగ్గా తెలియదు. తెలుసుకోవాలన్నా సమస్యే. రాకెట్ టెక్నాలజీలా ఏవేవో మాట్లాడతారు"

"ఇది చాలా పెద్ద సమస్య"

"మరి? ఒకడు పాయింట్లేసాడు, ఒకడు లెక్కలు కట్టాడు. ఒకడు శ్రీకాళహస్తి ప్రయాణం కట్టాడు, ఒకడు ఎక్కడికో వెళ్లిపోయి ఇప్పటివరకూ రాలేదు.

"అయ్యో!! "ఒకాయన విసిగిపోయి ఏ పీఠాధిపతి దగ్గరకో వెళ్లి చొక్కా తీసేసి సాష్టాంగపడ్డాడు.

"సమస్య తీరిందా?" "ఆయన విభూతిచ్చారు. ఏదో మాట్లాడే లోపల శిష్యులు లాగి అవతలికి పంపారు"

"బాధగా ఉంటోంది"

"అమ్మాయికి సంబంధాలు చూస్తున్నావా?" అన్నాను. అలవాటుగా అడిగానే కానీ మరో ఉద్దేశం ఏమీ లేదు. తిరుగు టపాలో ఏమొస్తుందో తెలుసు. "రెండు మాటలు వాడావు" అన్నాడు.

"అక్కడి నుండి పెద్ద జ్యోతిష శాస్త్రవేత్త వద్దకు వెళ్లాడు. అక్కడ అంటగట్టిన పరిహార ప్రక్రియలన్నీ ముగించుకుని ఇంటికి వచ్చేసరికి ఇల్లంతా గుల్లయింది"

"మీరేం చేస్తున్నారు?"

"ఫొటోలు చూపిస్తున్నాను మా ఆవిడకి" "శభాష్"

"ఆవిడ సెలక్షన్ బాగుంటుంది"

"అవును ప్రతి ఫొటోనూ జాగ్రత్తగా చూస్తుంది" "అంటే అమ్మాయి టేస్ట్‌ను పరిగణనలోకి తీసుకుని అబ్బాయి హావభావాలను పరికిస్తున్నారన్నమాట"

"కాదు" "మరి?"

"ఫొటో చూసి నన్ను రెండుసార్లు జాగ్రత్తగా చూస్తుంది"

"ఓ.. నీ మనసులో ఏముందో గ్రహిస్తున్నారన్నమాట"

"ససేమిరా!" "అయ్యో"

"అవును, నాకో మనసు, గ్రహింపు ఎన్నడూ ఉండదు. ఎప్పుడూ ఆగ్రహింపే!" "మరి అలా ఎందుకు చూస్తారావిడ?"

"నాలాగా లేడు కదా అన్నది నిర్ధారించుకోవటం కోసం అని నేను అనుకుంటున్నాను"

"అన్యాయం" "అదే న్యాయం"

"అదేంటి?"

"రేపు ఏది ఎలా ఉన్నా నన్నెవరూ అడగక్కరలేదు. ఇంతకీ ఓ మాట చెప్పు.

"ఏంటది?" "తెలియకపోయినా చెప్పు"

"తప్పకుండా. నేను ఏ రోజూ ఏదీ తెలుసుకోలేదు. తెలియనివే చెప్పారు.. జ్యోతిష్యంలాగా!"

"శభాష్. అసలు జాతకాలు నప్పాలా?"

...........

మహాభారతంలో అనుశాసన పర్వంలోని దాన ధర్మ పర్వంలో ఒక విషయం ఉంది. జగన్మాత పార్వతీదేవి పరమేశ్వరుడిని ఇలా అడిగింది.

"భగవాన్, మీరు చెబుతున్నదానిని బట్టి మనుష్యుని అవస్థ మంచిదైనా చెడ్డదైనా అది స్వయంకృతమైన దాని ప్రతిఫలం. కానీ లోకంలో కనిపించేదేమిటంటే ప్రజలు శుభాశుభ కర్మఫలాలను గ్రహజనితములని తలచి ఆ గ్రహ నక్షత్రాలను ఆరాధిస్తూ ఉంటారు. ఇది సరైనదా? దయచేసి ఈ సందేహం నివృత్తి చేయగలరు!"

**- వేదాంతం శ్రీపతిశర్మ**

# ఈ ప్రక్రియలతో మెదడుకు చైతన్యం!

**కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) విస్తరించడంతో అన్ని రంగాల్లో అనూహ్య పరిణామాలు వస్తున్నాయి. ముఖ్యంగా వైద్య రంగంలో చికిత్సకు ఏమాత్రం సాధ్యం కానివైనా సులువుగా సాధ్యమయ్యేలా చిక్కులు తొలగుతున్నాయి. వ్యాధిని చాలా తొందరగా, కచ్చితంగా గుర్తించడం, రోగి గత చరిత్రను విశ్లేషించడం, అనువైన చికిత్సను సూచించడం వంటి విధానాల్లో కృత్రిమ మేధ కీలక పాత్ర వహిస్తోంది.**

అయితే మెదడులా పనిచేసే డిజిటల్ బ్రెయిన్‌ను కూడా తయారు చేసే పనిలో శాస్త్రవేత్తలు నిమగ్నమై ఉన్నారు. మెదడు చేసే పనుల్లో కొన్ని అది చేస్తుంది కాబట్టి దాన్ని సెకండ్ బ్రెయిన్‌గా అభివర్ణిస్తున్నారు.

మెదడు కేంద్రంగా ఎన్నో ప్రయోగాలు చేస్తున్నారు. నాడీ మండలాన్ని నియంత్రించే కేంద్రం మెదడు. మెదడు ఆరోగ్యంగా ఉంటే జ్ఞాపకశక్తితో పాటు నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెరుగుతుంది. మెదడులో వంద కోట్ల న్యూరాన్లు ఉంటాయి. ఒక్కో న్యూరాన్ కనీసం వెయ్యి న్యూరాన్లతో అనుసంధానమై ఉంటుంది. మనం ఏ పని చేసినా ఆ సమాచారం అంతా న్యూరాన్ల ద్వారానే అత్యంత వేగంగా మెదడుకు చేరుతుంటుంది. యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియాలోని లేబొరేటరీ ఆఫ్ న్యూరో ఇమేజింగ్ పరిశోధకుల అంచనా ప్రకారం మనిషి మెదడు నిమిషానికి 48 వంతున రోజుకు 70 వేల ఆలోచనలు చేస్తుందని వెల్లడించారు. భవిష్యత్తులో మానవాళిపై ఆధిక్యత సాధించే ప్రమాదాన్ని ఎదుర్కోడానికి ఎలాన్ మస్క్ న్యూరాలింక్ ప్రాజెక్ట్‌ను చేపట్టారు. న్యూరాలింక్ బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్‌లో(బీసీఐ)లో 8 మిల్లీ మీటర్ల వ్యాసం కలిగిన ఎన్1 అనే చిప్ ఉంటుంది. ఈ చిప్‌ను ఇప్పటికే వన్యప్రాణులపై ప్రయోగించి వాటితో అనేక పనులు చేయిస్తున్నారు. చిప్‌లోని బ్యాటరీ వైర్‌లెస్ పద్ధతిలో చార్జి అవుతుంది. కంప్యూటర్లతో మనుషులను అనుసంధానం చేయడానికి న్యూరాలింక్ బీసీఐ ఉపయోగపడు తుందని చెబుతున్నారు. మెదడులోని న్యూరాన్ల మధ్య ప్రసారమవుతున్న సందేశాలను ఎలెక్ట్రోడ్లు గుర్తించి ఎన్1 చిప్‌కు పంపుతాయి. ఒక చిప్‌లోని ఎలెక్ట్రోడ్లు వెయ్యి న్యూరాన్ల చర్యలను పరిశీలిస్తుంటాయి.



ఈ విధంగా ఒక వ్యక్తిలోకి 10 చిప్‌లను ప్రవేశపెట్టవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పుర్రెలోని చిన్న భాగాన్ని తొలగించి ఎన్1 సాధనాన్ని అమరుస్తారు. ఈ చిప్‌లోని సన్నటి ఎలక్ట్రోడ్లను మెదడులోకి చొప్పిస్తారు. ఒక చిప్‌లో మూడు వేలకు పైగా ఉండే ఎలక్ట్రోడ్లను మెదడులోని ముఖ్యమైన భాగాలకు చేరువగా ప్రవేశపెడతారు. చిప్‌ను సురక్షితంగా అమర్చడానికి ప్రత్యేకంగా ఒక రోబోను న్యూరాలింక్ అభివృద్ధి చేసింది. పుర్రెలో ఎన్1 సాధనాన్ని అమర్చిన తరువాత బిసిఐ (న్యూరాలింక్ బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్ ఫేస్) మెదడు నుంచి విద్యుత్ సంకేతాలను పంపడం. అందుకోవడం, ప్రేరేపించడం వంటివి చేస్తుంది. వాటిని కంప్యూటర్లు విశ్లేషించగలిగితే అల్గోరిథమ్‌లుగా మారుస్తుంది.


ఈ ప్రకియ వల్ల నాడీ సమస్యలు, వెన్నుపూస గాయాలు, పక్షవాతం వంటి వాటివల్ల కాళ్లు, చేతులు పూర్తిగా లేదా పాక్షికంగా చచ్చుబడ్డ రోగుల్లో స్పర్శ, కదలికలు మెరుగుపరిచే వీలు కలుగుతుందని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. వీరు తమ సాధనాలను సులువుగా ఉపయోగించగలుగుతారని, దీర్ఘకాలంలో వీరి అవయవాలు పూర్తి స్థాయిలో పునరుద్ధరించే వీలుంటుందని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. అంతేకాదు, పార్కిన్‌సన్, డిమెన్షియా, అల్జీమర్స్.. తదితర వ్యాధులతో పాటు మానసిక సమస్యల చికిత్సకు కూడా ఈ ప్రక్రియ ఉపయోగపడుతుందని నమ్ముతున్నారు.

2010లో ఇటలీకి చెందిన మైఖేల్ రొక్కాటీ మోటార్‌బైక్ ప్రమాదంలో గాయపడి వెన్నుపూస పూర్తిగా దెబ్బతింది. దాంతో ఆయన పక్షవాతానికి గురై తన కాళ్లలో స్పర్శను కోల్పోయాడు. డాక్టర్లు శస్త్రచికిత్స చేసి వెన్నెముకలో ఎలెక్ట్రికల్ ఇంప్లాంట్స్ అమర్చారు. దాని సాయంతో మైఖేల్ నడవగలిగాడు. ఇంత తీవ్రంగా గాయపడిన వ్యక్తి మళ్లీ నడిచిన సంఘటనలు ఇంతకు ముందెప్పుడూ జరగలేదు.

కానీ ఆధునిక విధానాలు వైద్య రంగంలో చరిత్రను తిరిగి రాస్తున్నాయి. మైఖేల్ వేగంగా కోలుకోడానికి టెక్నాలజీ ఒకటే కారణం కాదు. దీని వెనుక అతని ఉక్కు సంకల్పం కూడా ఉందని డాక్టర్లు అంటున్నారు. చైనాలో 2011లో రోడ్డు ప్రమాదంలో మెడ విరిగి, అసలు నడవలేక పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తికి మెదడు, వెన్నుపూసకు చైతన్యం కలిగించి మళ్లీ నడవగలిగేలా వైద్యులు చేయగలిగారు. నెదర్లాండ్‌కు చెందిన 40 ఏళ్ల గెర్ట్-జన్ ఒస్కామ్ చైనాలో 2011లో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. మెడ విరిగి పక్షవాతం ఆవరించింది. అటు ఇటు కదలలేక మంచానికే పరిమితం అయ్యారు. ఈ పరిస్థితుల్లో స్విట్జర్లాండ్‌కు చెందిన న్యూరో సైంటిస్టులు బ్రెయిన్ మెషిన్‌ను అభివృద్ధి చేసి ఒక్సా మ్‌లో ప్రయోగించారు. ప్రమాదంలో వెన్నుపూస నరాలు దెబ్బతిని చచ్చుబడిన కండరాలను తిరిగి పనిచేయించగలిగారు. వైర్‌లెస్ సిగ్నల్స్‌ను మెదడుకు అనుసంధానించడంతో కండరాలు మళ్లీ పుంజుకుని పనిచేయడం ప్రారంభించాయి. ఇందులో డాక్టర్లు ఒక సాధనాన్ని రోగి ఒస్కామ్ శరీరంలో అమర్చగా అది మెదడులోని తరంగాలను చదివి వెన్నెముకకు సిగ్నల్స్ పంపించడంతో ఇది సాధ్యమైంది. ఈ కదలిక అంతా పూర్తిగా రోబోటిక్‌మయమైంది. బటన్ లేదా సెన్సార్ ద్వారా ప్రేరేపించడమైంది.



లాయుసన్నే యూనివర్సిటీ ఆస్పత్రికి చెందిన న్యూరో సర్జన్ ప్రొఫెసర్ జోసిలిన్ బ్లోచ్‌రోగి ఒస్కామ్ మెదడులో ఎలెక్ట్రోడ్లను అమర్చి ప్రేరేపించగా, అది ఒస్కామ్ కాళ్లు కదపడానికి ప్రయత్నించే సమయంలో ఎలెక్ట్రోడ్లు న్యూరల్ యాక్టివిటీని గమనించగలిగాయి. ఈ మేరకు రీడింగ్స్ ఆల్గోరిథమ్స్ వల్ల ప్రాసెస్ చేయబడ్డాయి. అవి నాదులు కింద మార్చబడ్డాయి. తరువాత అవి వెన్నెముకలోని ఎలెక్ట్రోడ్లకు పంపబడ్డాయి. వెన్నెముకలోని నరాలను నాడులు చైతన్యవంతం చేయడంతో కండరాల్లో కదలికలు కనిపించాయి. ఈ ప్రయోగంతో బ్రెయిన్‌కు వెన్నెముకకు మధ్య కమ్యూనికేషన్‌ను తిరిగి పునరుద్ధరించగలిగామని అది డిజిటల్ బ్రిడ్జి సాధనం ద్వారా కాలి కదలికను నియంత్రించగలిగిందని, ప్రొఫెసర్ గెగోయిరె కోర్టైన్ వెల్లడించారు. ఈ సాధనం సహజమైన అవయవంలాగే పని చేస్తోందని ఒస్కామ్ వెల్లడించాడు. ఇదివరకు మాదిరిగానే నిల్చోవడం, నడవడం చేయగలుగుతున్నానని చెప్పాడు. ఈ సాధనంతో దాదాపు 40 సార్లు శిక్షణ పొందిన తరువాత తన కాళ్లపై ఒస్కామ్ పట్టు సాధించగలిగాడు. అయితే ఈ ప్రయోగం అంతా మొదటి దశలోనే ఉంది.



భవిష్యత్తులో సూక్ష్మాతి సూక్ష్మమైన సాధనాలు పక్షవాత రోగులకు ఎంతో ప్రయోజనం కలిగిస్తాయని వైద్య నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అమెరికాలోని పిట్స్‌బర్గ్ యూనివర్సిటీలోని కెర్నెజిమిలన్ యూనివర్సిటీ పరిశోధకులు బ్రెయిన్ స్ట్రోక్ రోగులకు కొత్త న్యూరో టెక్నాలజీతో ప్రేరణ కలిగించారు. దీనివల్ల ఆయా రోగుల్లోని వెన్నెముక తక్షణం ప్రేరణ చెందడంతో అవయవాలు, చేతుల్లో చలనం కనిపించింది. ఈ న్యూరో టెక్నాలజీలో జత లోహపు ఎలెక్ట్రోడ్లు ఉంటాయి. మెడ భాగంలో వీటిని అమరుస్తారు. ఇవి బ్రెయిన్ స్ట్రోక్ రోగుల్లో మళ్లీ కదలికలను రప్పిస్తాయి. పరిశోధనల ప్రకారం 25 ఏళ్లు పైబడిన వారిలో ప్రతి నలుగురిలో ఒకరు స్ట్రోక్‌కు గురవుతున్నారు. స్ట్రోక్ వచ్చిన ఆరు నెలలకు పక్షవాత దశకు వీరు చేరుకుంటున్నారు. అలాంటి వారికి ఈ తాజా న్యూరో టెక్నాలజీ ఆసరా కల్పిస్తుందని పరిశోధకులు నమ్ముతున్నారు. ఈ కొత్త టెక్నాలజీ అత్యధిక స్థాయిలో స్థిరంగా నొప్పితో బాధపడుతున్నవారికి ఇప్పటికే వినియోగిస్తున్నారు. వెన్నెముకకు గాయం అయిన తరువాత వెన్నెముకను ప్రేరేపించడం వల్ల కాళ్లల్లో కదలిక ఏర్పడుతోందని పరిశోధన సంస్థలు నిరూపించాయి.

ఇదిలా ఉండగా శాస్త్రవేత్తలు మానవ మెదడు మాదిరి పనిచేసే కృత్రిమ వ్యవస్థల కోసం పరిశోధనలు సాగిస్తున్నారు. సిల్వర్ నానోవైర్లతో కూడిన నెట్‌వర్క్‌కు నేర్చుకునే సామర్థ్యం, జ్ఞాపకశక్తి ఉంటాయని ఆస్ట్రేలియాలోని సిడ్నీ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఈ నానోవైర్లు తలవెంట్రుకలో వెయ్యోవంతు మందాన్ని కలిగి ఉంటాయి. అధిక విద్యుత్ వాహక సామర్థ్యం ఉన్న సిల్వర్ వంటి లోహాలతో ఇవి తయారవుతాయి. నానోవైర్లు సొంతంగా అవసరమైన ఆకృతిని ఏర్పర్చగలవు. ఈ వైర్లతో కూడిన నెట్‌వర్క్‌తో శాస్త్రవేత్తలు ప్రయోగాలు నిర్వహించారు. ఈ నానోవైర్ నెట్‌వర్క్ మెదడులోని ఆలోచనా శక్తికి సంబంధించిన హార్డ్‌వేర్‌ను పోలి ఉంటుందని శాస్త్రవేత్తలు వివరించారు.

**- డాక్టర్ బి.రామకృష్ణ**



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



ఉద్యోగులకు స్థాన చలన సూచనలున్నాయి. ఆరోగ్య సమస్యలుంటాయి. దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. భూ, గృహ వసతులు ఏర్పాటు చేసుకుంటారు. శారీరక, మానసిక వత్తిడి ఉంటుంది. ప్రతికూలతలు ఉన్నా ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ప్రభుత్వ సంబంధమైన పనులు పూర్తి అవుతాయి. వాహన యోగం.

## వృషభం



చోర భయం పొంచి వుంది కనుక ప్రయాణాల్లో విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండండి. వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. ఆరోగ్య సమస్యలు ఉంటాయి. పేరు ప్రతిష్టలు లభిస్తాయి. వ్యాపారాభివృద్ధి బాగుంటుంది. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. రుణాలు మంజూరవుతాయి. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు.

## మిథునం




తీర్థ యాత్రలు చేస్తారు. భాగస్వామ్య వ్యాపారులకు సానుకూలంగా ఉంటుంది. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. అనుకోని సంఘటనలు జరిగినా ఆత్మస్థైర్యంతో ఎదుర్కొంటారు. సంతానాభివృద్ధి సంతృప్తిని స్తుంది. ఆరోగ్య సమస్యలు తీరి ప్రశాంతత ఏర్పడుతుంది. శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతారు. ఖర్చులు అధికం.

## కర్కాటం



శారీరక, మానసిక ఒత్తిడి ఉంటుంది. వాహన యోగం. సంతానాభివృద్ధి తృప్తినిస్తుంది. ఆనుకోని ధన యోగ సూచనలున్నాయి. పేరు ప్రతిష్టలు లభిస్తాయి. సాహిత్య సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. అకారణంగా మానసిక ఆందోళనకు లోనవుతారు. స్త్రీలకు శుభ యోగం. కుటుంబంలో మనస్పర్థలకు అవకాశం. క్రయ-విక్రయాలు యథాతథం.

## సింహం



ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి. ఉద్యోగాభి వృద్ధి సంతోషం కలిగిస్తుంది. దేశాంతర ప్రయాణం చేస్తారు. విందు-వినోదాల్లో పాల్గొంటారు. విలాసవంతమైన జీవితం పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. కీర్తి ప్రతిష్టలు లభిస్తాయి. విద్యార్థులకు విజయం లభిస్తుంది. ప్రయత్నాలు ఫలిస్తాయి. బంధు, మిత్రులను కలుసుకుంటారు. శుభ వార్తలు వింటారు.

## కన్య



అదనపు ఆదాయ మార్గాలకై అన్వేషిస్తారు. కుటుంబ గౌరవం పెరుగుతుంది. వ్యాపారులకు వారాంతంలో రుణాలు లభిస్తాయి. వ్యాపారాభివృద్ధి ఆశించిన మేరకు ఉంటుంది. ఆహార, ఆరోగ్య సలహాలు పాటించండి. వివాదాలకు దూరంగా వుండడం మంచిది. వృత్తి వ్యాపారులకు బాగుం టుంది. కుటుంబ సభ్యుల మధ్య ఐకమత్యం ఏర్పడుతుంది.

## తుల



చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆలోచనల్లో స్థిరత్వం ఏర్పడుతుంది. ఆరోగ్య సమస్యలుంటాయి. ఆదాయానికి మించిన ఖర్చులున్నా సమయానికి ఏదో విధంగా సర్దుబాటు చేసుకుం టారు. అనుకోని సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొం టారు. దేశాంతర ప్రయాణ సూచనలున్నాయి. వృథా ఖర్చులుం టాయి. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి వస్తుంది.

## వృశ్చికం



స్త్రీల వల్ల సమస్యలు వచ్చే అవకాశాలున్నాయి. శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతారు. శారీరక, మానసిక వత్తిడికి లోనవుతారు. వారాంతంలో ఆకస్మిక ధన యోగం. కుటుంబ గౌరవం పెంపొందుతుంది. అన్ని వ్యవహారాల్లో మీదే పై చేయిగా ఉంటుంది. ఉద్యోగాభివృద్ధి సంతృప్తినిస్తుంది. ధర్మ రక్షణకై పాటుపడతారు. ప్రముఖులను సందర్శిస్తారు. క్రయ-విక్రయాలు యథాతథంగా ఉంటాయి.

## ధనుస్సు



కుటుంబంలో మనస్పర్థలకు అవకాశం. వృథా ఖర్చులు ఉంటాయి. శుభ కార్యాల్లో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాల్లో వున్నవారికి బాగుంటుంది. ఆదాయానికి తగిన ఖర్చులుంటాయి. ఉద్యోగులకు బాగుంటుంది. అనుకున్నది సాధించలేకపోవచ్చు. సామాజిక సంఘర్షణకు లోనవుతారు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. ధార్మిక చింతన అలవడుతుంది. వ్యతిరేకతలు ఎదురైనా పనులు పూర్తి చేస్తారు.

## మకరం



ఆరోగ్యం కుదుట పడుతుంది. వృత్తి ఉద్యోగాల్లో ఉన్నవారికి ఆశించిన ఫలితాలుంటాయి. కొత్త విషయాలు తెలుసుకుంటారు. ఉద్యోగులకు ఆర్థికంగా బాగుంటుంది. చిరు వ్యాపారులకు పోటీ ఎదురైనా ఎవరి లాభాలు వారికి ఉంటాయి. దుర్వ్యసనాలకు దూరంగా వుండా లని దృఢ నిశ్చయం చేసుకుంటారు. శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది. దూర ప్రాంత ప్రయాణం చేస్తారు.

## కుంభం



విందు-వినోదాల్లో పాల్గొంటారు. ముఖ్యమైన పనుల్లో ఆటంకాలు ఏర్పడినా సకాలంలో పనులు పూర్తి చేస్తారు. ఉద్యోగంలో పని వత్తిడి ఉంటుంది. ఆలోచనల్లో స్థిరత్వం లోపిస్తుంది. శుభకార్యాల్లో పాల్గొంటారు. సంతానాభి వృద్ధి సంతృప్తికరంగా ఉంటుంది. బంధు, మిత్రులను కలుసు కుంటారు. దేశాంతర ప్రయాణం చేస్తారు. వాహన యోగం.

## మీనం



వ్యాపారులకు పోటీ ఎక్కువగా ఉంటుంది. ముఖ్యమైన ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగులకు బాగుంటుంది. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. ఆకస్మిక సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. దీర్ఘకాలిక సమస్యలకు వారాంతంలో పరిష్కారం లభిస్తుంది. ఆరోగ్య సమస్యలుంటాయి. వృథా కాలక్షేపం చేస్తారు. బంధు, మిత్రులతో మనస్పర్థలకు అవకాశం. ధర్మ రక్షణకై పాటుపడతారు.

# నీరు ఏ దిక్కులో ప్రవహించాలి?

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్స్: 9885446501/9885449458




## గృహావరణం-
## నైరుతి నీటి ప్రవాహం

ఇంటి ఆవరణలో నీరు నైఋతి దిక్కుకు(దక్షిణ నైఋతి లేదా పశ్చిమ నైఋతి) ప్రవహించి దక్షిణ లేదా నైఋతి తూముల ద్వారా బయటకు పారినట్లయితే అనారోగ్యం కలిగి శత్రుభయం పొందవలసి ఉంటుంది.

## South-West-Premises Waterflow

If the water flow from your premises moves towards South-West and drains out by South-West outlets the dweller might face problems such as accidents, tensions and ill health.



## గృహావరణం-
## దక్షిణ నీటి ప్రవాహం

ఇంటి ఆవరణ దక్షిణ దిక్కుకు పల్లంగా ఉంటే అనుకూల ఫలితాలు ఉండవు. అలా పల్లంగా ఉండి, ఇంటి ఆవరణలోని నీరు దక్షిణ దిక్కుకు ప్రవహించి దక్షిణ తూముల ద్వారా బయటకు పారినట్లయితే ఆకస్మిక ప్రమాదాలు తటస్థించే అవకాశం ఉంటుంది.

## South-Premises Waterflow

The premises of the house towards South direction brings unfavourable results. If the water flow from your premises moves towards South and drains out by South outlets the dweller might face problems such as




ill health, difficulties in meeting expenses.

## గృహావరణం-
## ఆగ్నేయ నీటి ప్రవాహం

ఇంటి ఆవరణ ఆగ్నేయం పల్లంగా ఉంటే అనేక దుష్పరిణామాలు ఉంటాయి. అలా పల్లంగా ఉండి, ఇంటి ఆవరణలోని నీరు ఆగ్నేయ దిక్కుకు(తూర్పు ఆగ్నేయం లేదా దక్షిణ ఆగ్నేయం)నకు ప్రవహించినట్లయితే ధన నష్టం, మానసిక ఆందోళన, అనారోగ్యం కలిగే అవకాశముంది.

## South-East-Premises Waterflow

The natural slope of the surrounding of a house towards South-East brings unfavourable results. If the water flow from your premises moves towards South-East and drains out by South-East outlets the dweller might face




problems such as monetary losses, ill health and tensions.

## గృహావరణం-
## తూర్పు నీటి ప్రవాహం

సాధారణంగా గృహావరణం తూర్పు వాలుగా ఉంటే సత్ఫలితాలు ఉంటాయి. అలా ఉన్నప్పుడు, ఇంటి ఆవరణలోని నీరు తూర్పు దిక్కుకు ప్రవహిస్తుంది. అలా ప్రవహించినట్లయితే పుత్రసౌఖ్యం, ధన లాభం, వ్యవహార లాభాలు పొందే పరిస్థితులు ఏర్పడుతూ వుంటాయి.

## East Premises Waterflow

General slop of the premises of house brings favourable results. Then the water flow from your premises moves towards East and drains out



by East outlets the dweller will gain monetary benefits, increase in family members, good nature, prosperity and stable mind.

### సరదా రచనలకు ఆహ్వానం

జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి.
మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.
sunmagvaartha@gmail.com

# గెలుపులో ఓటమి

**"అదృష్టం అందలం ఎక్కిస్తూ వుంటే బుద్ధి బురదలోకి లాగుతుంద"ని సామెత ఊరికే అనలేదు. అమ్మ ఎగతాళి చేస్తున్నది నాన్నగారిని. ఇంతకీ ఆయన చేసిన తప్పేమిటంటే తన నాన్నగారిని, అంటే మా తాతయ్య గారిని యింకొకసారి జీనియస్సు అని పొగడటం!**

"మా నాన్నగారు కోర్టులో వాదిస్తూ వుంటే జడ్జీలు కూడా భయపడిపోయి వింటూండేవాళ్లు తెలుసా?" నాన్నగారు చెప్పారు.

"అదేం పాపం?" అమ్మ అడిగింది.

"మరి ఆయన వాక్ధోరణి అలా ఉండేది. ఎవరినీ లెక్కపెట్టేవారు కాదు. ఆయన కాళికా ఉపాసకుడు. ఒకసారి ఒక జడ్జి మీద కోపం వచ్చింది. నీకు ట్రాన్సుఫరు అవుతుందని శపించారట! ఆయన దెబ్బకు అదే పేరున్న పది మందికి ట్రాన్సుఫర్లు వచ్చాయట!" నాన్నగారు చెప్పారు.

"ఆయన దరిద్ర దేవతకు చుట్టమట కదా!"

"అదేంలేదు. మా అమ్మగారు ఇంటి కోడలుగా అడుగు పెట్టినప్పుడు ఆమె వంటి మీద అరవై తులాల బంగారం వుండేది. అరవై ఎకరాల మాగాణి భూములుండేవి. ఆమె పేరే సౌభాగ్యమ్మ".

"పాపం! అత్తగారి పేరులోనే భాగ్యముందన్నమాట!" "ఎందుకమ్మా అలా అంటావు?" అడిగాను అర్థంగాక.

"మీ బామ్మ తొంభై సంవత్సరాలకు పైగా బతికింది ఆరోగ్యంగా. కానీ అయిదోతనం పోగొట్టుకుని చాలా బాధలు అనుభవించింది. ఆమె కళ్లముందే ఆమె కూతుళ్లు, మనవరాళ్లు, మనవళ్లు చాలా మంది కాలం చేశారు. మహారాణిలా మెట్టినింటికి వచ్చిన ఆమె కటిక దరిద్రం అనుభవించింది" బాధపడుతూ చెప్పింది.

"అదేంటి! తాతయ్యగారు జీనియస్సు అన్నారు, సంపాదించలేదా? పోనీ ఆయన సంపాదించకపోయినా వారసత్వంగా వచ్చిన ఎకరాలు.. ఎకరాలు పొలాలు, తులాలు తులాలు బంగారం ఉన్నాయిగా అనుభవించ డానికి" నాకు సందేహం కలిగింది.

నాన్నగారు అందుకున్నారు.. "ఒరే వెధవా! నువ్వు పుట్టకముందే మీ తాతగారు కాలం చేశారు. ఆయనకు లాయరుగా మంచి పేరుంది. కేసులు వచ్చేవి కానీ కాసులు కురిసేవి కాదు. ఎందుకంటే ఆయనది జాలిగుండె. ఇంతని ఫీజు డిమాండు చేసేవారు కాదు. ఎవరు ఎంతిస్తే అంత పుచ్చుకునేవారు. చివరికి ఎంత పేదరికం అనుభవించారంటే నా స్కూలు ఫీజు, ఆ కాలంలో రూపాయి కట్టలేక నన్ను ఎన్నో నెలలు యింట్లో కూర్చోబెట్టేవారు. నేను నా స్నేహితుల దగ్గర నోట్సులు రాసుకుని వారికంటే ఎక్కువ మార్కులు తెచ్చుకునేవాడిని" చెప్పారు.

"మనది జమీందారుల వంశమంటారు, మరి ఆస్తి ఏమైంది?" పెద్దన్నయ్య ఆవేదన.

అమ్మ చెప్పింది "మీ తాత జీనియస్ కదా! ఆయన కుదురుగా లెక్కల టీచరుగా ఉంటే బాగుండేది. కానీ ఆ కాలంలో, అంటే స్వతంత్రం రాని చాలా కాలం ముందు జీనియస్సులు అందరూ న్యాయవాద వృత్తి చేపట్టి రెండు చేతులా బాగా సంపాదించేవారు. అందుకే అంతా హరించుకుపోయింది".

"అత్తగారి పేరులోనే భాగ్యం ఉందన్నమాట!" "ఎందుకమ్మా అలా అంటావు?" అడిగాను అర్థంగాక.

"ఎట్లా?" ఆశ్చర్యపోవటం మా వంతయింది. "అవును మరి, ఆ కాలంలో రాబడి లేక టర్మ్ ఫీజులు కట్టాలంటే సుభిక్షంగా వున్న మాగాణి భూములను తెగ అమ్మిపడేశారు. అలా మీ తాత లాయరు అయ్యేసరికి వున్న స్థిరాస్తి హరించుకుపోయింది. పోనీ ఆయన లాయరుగా ప్రాక్టీసు మద్రాసులో పెట్టివుంటే ఆ కథ మరోలా వుండేది. పుట్టిన ఊరు సెంటిమెంటుతో తెనాలిలో ప్రాక్టీసు చేసేవారు. అంతా బీదోళ్లు! ఈయనది జాలిగుండె. పైగా న్యాయానికి, ధర్మానికి కట్టుబడ్డారు. అబద్ధాలు చెబితే ముందు ఈయనే తన క్లయింటుని వాయించేవారు. కేసు బాగా వాదించి గెలిపించేవారు కానీ ఫీజు దగ్గర ఉదారం. ఇంట్లో దర్జాలు చూద్దామా! ఏదీ తగ్గకూడదు. పిండివంటలు, రెండు కూరలు, రెండు పచ్చళ్లు, పెరుగు, పప్పన్నాలు, నేతులు తాగడాలు, స్నేహితులకు, బంధువులకు విందుభోజనాలు" చెప్పారు.

"దాంతో ఆదాయం నిల్లు, ఖర్చులు ఫుల్లు!" అని అన్నయ్య కామెంటు చేశాడు.

"ఇంక కర్మలకు, తద్దినాలకు, పెళ్లిళ్లకు ఆర్భాటాలు చెప్పలేములే! బ్రాహ్మణుడంటేనే భోజనప్రియుడు. ఇక మీ తాత సంగతి అస్సలు చెప్పక్కరలేదు. ఆయనకు ఆకునిండా అన్నీ ఉండాలి. దాంతో చరాస్థి, స్థిరాస్థి హరించుకుపోయాయి" అమ్మ చెప్పింది.

"జీనియస్సులు కూడా తప్పులు చేస్తూ ఉంటారు. నాన్నగారు జీనియస్సు కాబట్టి తప్పు చేశారు" నాన్నగారి సమర్థింపు.

"ఆయన చేసిన తప్పేంటి?" నా ప్రశ్న.


"ఒకటా, రెండా? నన్నడుగు చెబుతాను" అమ్మ ఆవేశపడింది.


"ఒకటి.. ఆయన టీచరు ఉద్యోగం వదులుకోకుండా ఉండాల్సింది. రెండు.. 'లా' చదవకుండా ఉండాల్సింది. మూడు.. లా చదివినా దానికోసం ఆస్తులు అమ్ముకోకుండా ఉండాల్సింది. నాలుగు.. 'లా' పాసైన తర్వాత మద్రాసులోనే ఉండి ప్రాక్టీసు చెయ్యవలసింది" అమ్మ చెప్పింది.


"కనీసం నాన్నగారు మంచి ప్రభుత్వ ఉద్యోగం వెతుక్కుంటే బాగుండేది. నా బోడి స్కూలుఫైనలు వానాకాలం చదువుకే ఆ కాలంలో నాలుగు రకాల ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయి. మరి ఆయన కాలంలో ఎన్ని వచ్చి ఉండాలి!" నాన్నగారి ప్రశ్న.

"కాదు నాన్నగారూ, తాతయ్య ఒంట్లో కుటుంబ భక్తి, భుక్తి కంటే దేశభక్తి ఆలోచనలు ఎక్కువై ఉంటాయి. తెల్లోడి కింద పని చెయ్యడానికి యిష్టపడి వుండరు" నాకున్న అల్పబుద్ధితో వ్యాఖ్యానించాను.

**- వియోగి**


ఏదో తేడాగాడిలా ఉన్నావే..? లేకుంటే అన్ని
రిపోర్ట్ లు పర్ఫెక్ట్ గా రావడం ఏంటి...?!!


కడుపులో కాయ కాయాలంటే.... వ్రతం చెయ్యాల
ఫోన్లు లేకుండా మొగుడూ పెళ్ళాం పడగ్గది లో
నలభై రాత్రులు గడపాల.... కుర్రో కుర్రూ...!!


ముని మీద గౌరవం తో.. ఆయన
తపస్సు చేసుకునే 'స్థలం' వదిలేసి...
మిగతా కొండను తవ్వేసారు .. ప్రైవేటు
కంపెనీ వాళ్ళు ...!!

ఈ వారం కా'ర్టూన్స్'





## ఫోటో ఫీచర్



'ఇన్‌స్టా గ్రామం'గా పేరు గాంచిన బక్‌చన్ హానాక్ అనే ఈ ఊరు సియోల్‌లో ఉంది. ఆరు వందల ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన గ్రామమిది. సియోల్ వెళ్లే పర్యాటకుల జాబితాలో ఈ గ్రామం చేరింది. కొరియా సంప్రదాయ దుస్తులు ధరించి ఎంచక్కా ఇక్కడ ఫొటోలు దిగొచ్చు.





